Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 342 | పేజీలు 8 | వెల : 5 | మంగళవారం 20 మే 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్న విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్


తారీఫ్

| | |
|---|---|
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్లాక్ & వైట్ పేజీ |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| | ఫ్రంట్ పేజీ : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

# పథకాల అమలులో పౌరదర్శకత ముఖ్యం



## క్షేత్రస్థాయిలో ప్రజలకు పథకాలు చేరాలి

## కార్యక్రమాల అమలుకు మళ్లీ ఆకస్మిక తనిఖీలు

## సమీక్షలో అధికారులతో సిఎం చంద్రబాబు

అమరావతి పథకాల అమలుతీరును, అధికారుల పనితీరును బేరీజు వేస్తానని, ఇందుకోసం మళ్లీ ఆకస్మిక తనిఖీలు తప్పవని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వచ్చే నెల 12 నుంచే ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై సీఎం సమీక్షించారు. ప్రజా సేవ పథకాల అమలు, సంక్షేమ పథకాల పూర్తిస్థాయి సంతృప్తి ఇంకా కనిపించాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రేషన్, దీపం-2, ఆర్టీసీ, పంచాయతీ సేవలపై అభిప్రాయాలను పరిశీలించారు. పథకాలు, పౌరసేవలపై జూన్ 12 తర్వాత ఆకస్మిక తనిఖీ ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే సేవల్లో ప్రజలకు పూర్తిస్థాయి సంతృప్తి ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపరచాలని ఆదేశాలు జారీ చేశారు. దీపం లబ్ధిదారులకు ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము ఇచ్చే అంశంపై పరిశీలించాలన్నారు. డేటా అనలటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సీఎం మార్గనిర్దేశర చేశారు.

ఆర్టీసీ సేవల్లో ఇంకా మార్పులు రావాలని, నాణ్యత పెరగాలన్నారు సీఎం చంద్రబాబు సూచించారు. దీపం పథకంలో ఇచ్చే మూడు సిలండర్ల సబ్సిడీ ఒకేసారి జమ చేస్తామన్నారు. ప్రభుత్వ సేవల్లో డేటా కీలకం అని సీఎం అధికారులతో అన్నారు. 'జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు జరగొచ్చు. ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందే. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలి. దీపం లబ్ధిదారుల ఖాతాలో ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము జత అవుతుంది.

డాటా అనలిటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. రేషన్ పంపిణీ నాణ్యతపై ప్రజల సంతృప్తి పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది.

కొన్ని సంక్షేమ పథకాల అమలు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయిలో సంతృప్తి కనిపించాలి. ఆర్టీసీ టాయిలెట్స్, తాగునీటి నిర్వహణ విషయంలో అసంతృప్తి వస్తోంది. త్వరలో డ్వాక్రా మహిళలకు తడి చెత్త నిర్వహణ బాధ్యత, కంపోస్టు తయారీ అప్పగిస్తాం. ప్రభుత్వ సేవల్లో డేటా కీలకం' అని ప్రభుత్వ పథకాలు, సేవలపై సమీక్షలో సీఎం చంద్రబాబు అన్నారు.



# స్లీపర్ సెల్స్‌పై దృష్టి పెట్టండి..

## సీఎస్, డీజీపీకి పవన్‌కల్యాణ్ లేఖ

అమరావతి: రాష్ట్రంలో ఉగ్రవాద కదలికలపై నిరంతర అప్రమత్తత అవసరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తీర ప్రాంత జిల్లాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి ఆయన లేఖ రాశారు. రోహింగ్యాలు, ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్‌పై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. దేశ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా అంతర్గత భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# జివిఎంసిలో తగిన సంఖ్యా బలం ఉంది



## డిప్యూటి మేయర్ ఎన్నిక వాయిదాకు కారణం వేరు

## ఏపీ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

## ఎన్నిక వాయిదాపై ఆరా తీసిన నారా లోకేశ్

**విశాఖపట్నం:** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో తమకు కావాల్సినంత సంఖ్య బలం ఉందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జీవీఎంసీలో డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడింది. ఈ నేపథ్యంలో సోమవారం విశాఖపట్నంలో పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు.. డిప్యూటీ- మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం కావడానికి ఒక కారణం ఉందన్నారు. గత రాత్రి 11.00 గంటలకు ఆ పదవి జనసేన పార్టీకి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే ఆ పదవి కోసం టీడీపీలో ఆశావాహులున్న మాట వాస్తవమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇక ఈ ఎన్నిక వాయిదా పడడానికి కోఆర్డినేషన్ సమస్య కూడా ఒక కారణమన్నారు. అందుకే ఈ ఇబ్బంది వచ్చిందని ఆయన తెలిపారు. జీవీఎంసీ కౌన్సిల్‌కు సభ్యులంతా వస్తారని తాము ధీమాతో ఉన్నామన్నారు. దీనికి తాను పూర్తి బాధ్యత వహిస్తానని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మరోవైపు.. విశాఖపట్నంలో జరగాల్సిన డిప్యూటీ- మేయర్ ఎన్నిక వాయిదా పడడం.. అందుకు పార్టీ కార్పొరేటర్లు గైర్హాజరు కారణం కావడంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం సీరియస్ అయింది. ఈ ఎన్నికకు గైర్హాజరైన వారికి నోటీ-సులు జారీ చేయాలని రాష్ట్ర నాయకత్వానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశించారు. కొందరిపై చర్యలకు వెనకాడ వద్దని ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి ఆయన కీలక సూచన చేశారు. మరోసారి ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖపట్నం డిప్యూటీ- మేయర్ ఎన్నిక ఈ రోజు జరగాల్సి ఉంది. కానీ కౌన్సిల్‌లో సభ్యులు మొత్తం 74 మంది ఉంటే..

54 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ డిప్యూటీ- మేయర్ ఎన్నికకు 56 మంది సభ్యులు అవసరమ వుతారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికను మంగళ వారం నిర్వహించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇంకోవైపు ఈ డిప్యూటీ- మేయర్ ఎన్నికకు కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.



2

# కాళేశ్వరంలో కొనసాగుతున్న పుష్కరాలు

## పుణ్యస్నానాల కోసం తరలి వస్తున్న భక్తులు

కాళేశ్వరం: కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కరాలు కొనసాగుతున్నాయి. ఐదోరోజు సోమవారం కూడా భక్తులు పుణ్యస్నానాలకు తరలి వచ్చారు. సోమవారం కావడంతో కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో రోజైన ఆదివారం సెలవు కావడంతో భారీగా భక్తులు తరలివచ్చారు. త్రివేణి సంగమ పుష్కరిణి ఐదురోజులుగా జనంతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు- ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు పరవశించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మహిళలు సరస్వతి తీరం వెంట సైకత లింగాలు ఏర్పాటు- చేసి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. చీర, సారె సమర్పించి నదిలో దీపాలు వదిలారు. ముత్తయిదువులకు వాయినాలిచ్చి ఆశీర్వచనాలు పొందారు. సాయంత్రం సమయంలో నదీతీరాన సరస్వతి విగ్రహం ముందు నిర్వహించిన మహాహారతి క్రతువును చూసి భక్తులు పరవశించిపోయారు. ఆదివారం పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతి మహాస్వామి పుష్కరస్నానం చేసి ఆలయ దర్శనం చేసుకున్నారు. పుష్కర స్నానాలు చేసిన భక్తులు శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామి సన్నిధానానికి చేరుకున్నారు.

# సమస్యల పరిస్కారం కోసం వెళితే అరెస్టులా



హైదరాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్‌కర్నూలు పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిని కలిసే ప్రయత్నం చేసిన చెంచు సోదరులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇదేనా ప్రజాస్వామ్యం, ఇదేనా మీ సోకాల్డ్ ప్రజాపాలన అని నిలదీశారు. నల్లమల అడవుల నుంచి వచ్చానని గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి.. అడవి బిడ్డల సంక్షేమం పట్ల మీకు ఉన్న ప్రేమ ఇదేనా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తమ సంక్షేమం కోసం ఐటీ-డీఏ పీవోగా ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని వారు కోరడం తప్పా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన పోడుపట్టా భూముల్లో సాగు చేసుకోనివ్వడం లేదనే విషయాన్ని మీకు తెలపాలని రావడమే వారు చేసిన తప్పా అని అడిగారు. తమ ఆరాధ్య దైవాల ద్వారా వచ్చే ఆదాయాన్ని తమ బాగు కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేయడం వారి తప్పా అని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన చెంచు ప్రతినిధులు మల్లికార్జున్, పద్మ గురువయ్యతోపాటు- అమ్రాబాద్ పోలీసు స్టేషన్ లో నిర్బంధించిన చెంచులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నల్లమల అభివృద్ధికి ప్రత్యేక కృషి



అమ్రాబాద్: నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నామని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరిజల వికాసం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'నల్లమల డిక్లరేషన్'ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు చేపడతామని తెలిపారు. అనంతరం నల్లమల ప్రాంతం గురించి సీఎం ప్రసంగించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారని నాటి రోజులను సీఎం గుర్తు చేశారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే తన గుండె ఉప్పొంగిపోతోందన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తామని శుభవార్త చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తామని అన్నారు. దిగ్గజ కంపెనీలతో పోటీపడేలా శిల్పారామం దగ్గర మహిళలకు స్టాళ్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి భోజనం చేసి వచ్చానని గుర్తు చేశారు. నేడు ప్రతి పేదవాడి ఇంటికీ సన్న బియ్యం అందుతోందని తెలిపారు. ఇప్పటి వరకు రైతుల కోసం రూ.60వేల కోట్లు- ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. గతంలో వరి వేస్తే ఉరే అని ఆనాడు అన్నారు.. ఆ దొర మాత్రం వందల ఎకరాల్లో వరి వేసుకున్నారు.. మీరు వరి పండిస్తే బోనస్ ఇస్తామని మేము చెప్తున్నాం.. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం.. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే ఎవరూ తినేవారు కాదు.. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకున్నాం. నిత్యావసరాల ధరలు తగ్గించడంలో మనమే నంబర్ వన్ అని కేంద్రం చెప్పింది.. శాంతి భద్రతల్లో కూడా మనమే నంబర్ వన్‌లోనే ఉన్నాం.. రాష్ట్ర ఆదాయంలో కూడా తెలంగాణ నంబర్ వన్ అని కేంద్రమే చెప్పింది.. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం రూ.60 వేల కోట్లు- ఖర్చు చేశాం అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగిపోతోంది. పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటున్నా. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు వాసులను పిలిచేవారు. ఇక్కడి ప్రజలు కట్టిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయి. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తాం. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తాం. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తాం అన్నారు. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ వచ్చింది. ఆమె గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేశారు. 50 ఏళ్ల తర్వాత ఇందిరాగాంధీ పేరు చెప్పుకొంటున్నాం. దేశానికి స్వేచ్ఛనిచ్చిందే కాంగ్రెస్. అందరికీ భూములు ఇచ్చి ఆత్మగౌరవం నింపాలన్నది మా పార్టీ నినాదం. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ ఉంటుందని రేవంత్ అన్నారు. అనంతరం సతీమణితో సహా సీఎం రేవంత్‌రెడ్డి కొండారెడ్డిపల్లె శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ సీఎం దంపతులు, మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభాపతి గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రయమివ్వడానికి...భారత్ ధర్మసత్రం కాదు

న్యూఢిల్లీ: ప్రపంచంలోని అందరికీ ఉచితంగా ఆశ్రయం ఇవ్వడానికి భారతదేశం ధర్మశాల కాదని సుప్రీంకోర్టు సోమవారం నాడు కీలక వ్యాఖ్యలు చేసింది. శరణార్థిగా తనకు ఇండియాలో ఆశ్రయం ఇవ్వాలని శ్రీలంక జాతీయుడు ఒకరు చేసిన అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలంతో సంబంధాలున్నాయనే అనుమానంతో 2015లో పిటిషనర్‌ను అరెస్టు చేశారు. తనను శరణార్థిగా పరిగణించాలని కోరుతూ అతను వేసిన తాజా పిటిషన్‌పై న్యాయ మూర్తులు దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వినోద్ చంద్రతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. శ్రీలంక జాతీయుడికి 2018లో విచారణ కోర్టు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద పదేళ్ల జైలు శిక్ష విధించింది. 2022లో మద్రాసు హైకోర్టు అతని జైలుశిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్ష పూర్తికాగానే దేశం విడిచి వెళ్లాలని, దేశం విడిచివెళ్లడానికి ముందు శరణార్థి శిబిరంలో ఉండాలని ఆదేశించింది. కాగా, సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ తన వాదన వినిపించారు. వీసాతో తాను ఇండియా వచ్చానని, తన ప్రాణాలకు స్వదేశంలో ముప్పు ఉందని కోర్టుకు విన్నవించారు. తన భార్య, పిల్లలు ఇండియాలో స్థిరపడ్డారని, ఇప్పటికి తాను మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నానని, డిపోర్టేషన్ ప్రక్రియ మొదలు కాలేదని చెప్పారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ఉచిత సత్రం కాదని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని శ్రీలంక వాసి పేర్కొన్నాడు. అంతేగాక, తన భార్యాపిల్లలు ఈ దేశంలోనే సెటిల్ అయ్యారని తెలిపాడు. తనకు ఇక్కడే ఆశ్రయం కల్పించాలని కోరాడు. దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు భారతదేశం ఆశ్రయం ఇవ్వాలా? ఇప్పటికే మా దేశంలో 140 కోట్ల మంది జనాభా ఉంది. అన్ని దేశాల నుంచి వచ్చే వారిని ఆదరించేందుకు భారత్ ధర్మశాల కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శ్రీలంకలో అతడి ప్రాణాలకు ముప్పు ఉందని తెలిపారు. అలాగైతే మరో దేశానికి వెళ్లండని సుప్రీం కోర్టు సూచించింది.

# ఉపరితల ఆవర్తన ప్రభావం

**హైదరాబాద్:** మరో నాలుగు రోజులపాటు తెలంగాణలో వర్షాలు కురియనున్నాయి.

బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు- తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు- పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమొరిన్ సహా బంగాళాఖాతం లోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

మరోవైపు అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది.

# పెరుగుతున్న దేశ ద్రోహుల జాబితా



న్యూఢిలీ: పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్న పలువురు భారతీయుల్ని అధికారులు గుర్తించి ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తున్నారు. ఇప్పటికే హర్యానా, పంజాబ్, యూపీలో దాదాపు ఎనిమిది మంది గుఢచారులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అరెస్టయిన వారిలో విద్యార్థి, యూట్యూబర్, వ్యాపారవేత్త, గార్డ్ తదితరులు ఉన్నారు. తాజాగా మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. హర్యానా లోని నుహ్‌లో ఓ అనుమానితుడిని అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడు మేవాట్ జిల్లా టౌరు తహసీల్‌లోని కంగర్కా గ్రామానికి చెందిన మహ్మద్ తారీఫ్‌గా గుర్తించారు. అతడు పాక్ ఏజెంట్లకు భారత సమాచారాన్ని చేరవేస్తున్నట్లు గుర్తించారు. కాగా, నుహ్‌లో ఇప్పటికే ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రజక గ్రామానికి చెందని అర్మాన్‌ను గూఢచర్యం ఆరోపణలపై రెండు రోజుల క్రితం అరెస్ట్ చేశారు. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నారన్న ఆరోపణలపై ఇప్పటికే దేశవ్యాప్తంగా మొత్తం ఎనిమిది మంది అనుమానితుల్ని అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారిలో గజాలా (పంజాబ్), యాసీన్ మొహమ్మద్, నోమాన్ ఇలాహి (యుపీ), 26 ఏళ్ల అర్మాన్ (నుహ్), 25 ఏళ్ల దేవేంద్ర సింగ్ ధిల్లాన్ (కైతాల్), మహమ్మద్ ముర్తజా అలీ (జలంధర్), జ్యోతి మల్హోత్రా (హర్యానా యూట్యూబర్), షహజాద్ (యుపీ మొరాదాబాద్) ఉన్నారు. తాజా అరెస్ట్‌తో తొమ్మిది మంది గూఢచారులను అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు అయ్యింది. వీరంతా పాక్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ కోసం పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు.తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లు-..తమ స్వార్థం కోసం తల్లిలాంటి దేశానికి ద్రోహం చేస్తున్న వాళ్లు వీరంతా అని చెప్పుకోవాలి. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో మొదలుపెడితే.. ఇప్పటి వరకు పాక్ కోసం పని చేస్తున్నట్లు- భావిస్తున్న 11 మంది గూఢాచారులు బయటపడ్డారు. భారత్, పాక్ యుద్ధం తర్వాత పోలీసులు, నిఘా వర్గాలు, ఇతర అధికారుల చేతికి వీరు చిక్కారు. వీరంతా హర్యానా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు కావటం గమనార్హం. ఆ 11 మంది గురించిన వివరాల్లోకి వెళితే.. జ్యోతి మల్హోత్రాది హర్యానాలోని హిసర్. 33 ఏళ్ళ జ్యోతికి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ట్రావెలింగ్ వీడియోలు చేస్తూ ఉంటుంది. యూట్యూబ్‌లో ట్రావెల్ విత్ జో పేరిట ఛానల్ ఉంది. ఢిల్లీలోని పాకిస్తాన్ హై కమిషన్‌కు చెందిన డానిష్ అనే ఉద్యోగితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో పాకిస్తాన్ కోసం గూఢాచారిగా పని చేయటం మొదలెట్టింది. పంజాబ్‌లోని మస్తఫర్‌కు చెందిన దేవేంద్ర సింగ్ దిల్హన్ పాటియాల లోని ఖల్స కాలేజీలో ఎంఏ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. కొన్నేళ్ల క్రితం ఇతడికి పాకిస్తాన్ ఇంటెలిజెన్స్, ఐఎస్ఐలతో పరిచయం అయింది. అప్పటినుంచి భారత్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. మే 12వ తేదీన తన ఫేస్‌బుక్ ఖాతాలో పిస్టోళ్లు, గన్నుల ఫొటోలు పెట్టి అరెస్ట్ అయ్యాడు. పోలీసుల విచారణలో పాకిస్తాన్ కోసం పని చేసినట్లు- ఒప్పుకున్నాడు. తారిఖ్‌ది హర్యానాలోని కంగర్కా గ్రామం. పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తున్నాడన్న కారణంతో హర్యానా పోలీసులు, కేంద్ర నిఘా వర్గాలు సంయుక్తంగా కలిసి అతడ్ని అదుపులోకి తీసుకున్నాయి. 23 ఏళ్ల అర్మన్ భారత్, పాకిస్తాన్ యుద్ధం సమయంలో భారత దేశానికి సంబంధించిన విషయాలను పాకిస్తాన్‌కు చేరవేశాడు. హర్యానాలోని నోహ్‌లో ఇతడ్ని అరెస్ట్ చేశారు. 24 ఏళ్ల నౌమన్ ఇల్లహిది ఉత్తర ప్రదేశ్‌లోని కైరానా. నౌమన్ హర్యానాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇతడు పాకిస్తాన్ ఐఎస్ఐతో సంబంధం పెట్టు- కున్నాడు. పాకిస్తాన్‌కు సమాచారం అందించిన ప్రతీసారి డబ్బులు వచ్చేవి. అవి అతడి బావ మరిది అకౌంట్‌లో పడేవి. ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన షహజాద్ పాకిస్తాన్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో వస్తువుల్ని అక్రమ రావాణా చేస్తుంటాడు. పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెన్సీతో సంబంధం పెట్టుకున్నాడు. నిన్న కూడా దేశానికి సంబంధించిన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేశాడు. దీంతో ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అతడ్ని అరెస్ట్ చేసింది. మహ్మద్ ముర్తాజా అలీ పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐతో కలిసి పని చేస్తున్నాడు. పాకిస్తాన్ కోసం పని చేయటం కోసం ఏకంగా ఓ మొబైల్ యాప్‌ను తయారు చేశాడు. గుజరాత్ పోలీసులు ఇతడ్ని అరెస్ట్ చేశారు.

# విజయనగరంలో ఉగ్రమూలాల కేసు విచారణ

**నిందితులు ఇద్దరినీ కస్టడీకి కోరుతున్న పోలీసులు**

అమరావతి: విజయనగరంలో ఉగ్రమూలాల కేసు విచారణలో పోలీసులు జోరు పెంచారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న సిరాజ్, సమీర్ కస్టడీ కోసం కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఇద్దరినీ కస్టడీకి ఇస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. నిందితులకు నిధులు ఎవరు సమకూర్చారన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన సూత్రధారుల గుర్తింపు కోసం దర్యాప్తు ప్రారంభించారు.ఇద్దరికీ సౌదీ అరేబియా నుంచి ఐసిస్ మాడ్యుల్ ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. గతంలో రంపచోడవరం అటవీ ప్రాంతంలో వీరు బాంబు పనితీరుపై రిహార్సల్స్ చేసినట్లు- గుర్తించారు. గత 6 నెలల్లో సిరాజ్ 3 సార్లు సౌదీ వెళ్లినట్లు పోలీసులకు వివరాలు అందాయి. అందిన సమాచారాలపై నిర్ధరణకు సిరాజ్, సమీర్‌ను పోలీసులు కస్టడీకి కోరనున్నారు. మరోవైపు విజయనగరంలో ఉగ్రమూలాల కేసులో సంచలన విషయాలు బయటకు వచ్చాయి. ఈ కేసులో నిందితులు సిరాజ్, సమీర్ రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు కీలక అంశాలు ప్రస్తావించినట్లు- సమాచారం. సమీర్, సిరాజ్ కలిసి అల్‌హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ సంస్థను స్థాపించారు. ఆరుగురు వ్యక్తులు ఇన్‌స్టా గ్రూప్ క్రియేట్ చేసుకోగా.. ఇందులో సిరాజ్, సమీర్‌తో పాటు- కర్ణాటక, మహారాష్ట్ర యువకులు ఉన్నారని గుర్తించారు. ఈ ఆరుగురి ముఠా 3 రోజుల పాటు- హైదరాబాద్‌లో కలిసే ఉంది. ఐసిస్ హ్యాండ్లర్ సౌదీ నుంచి ఇచ్చే ఆదేశాల అమలుపై వీరు చర్చించారు. సమీర్, సిరాజ్ పేలుడు పదార్థాలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టారు. యూట్యూబ్‌లో పేలుడు పదార్థాల తయారీ విధానం చూశారు. బాంబులు తయారు చేయాలని ఇద్దరికి సౌదీ నుంచి ఆదేశాలు రాగా..

మిగతా నలుగురికి బాంబులు పెట్టే టార్గెట్లు- గుర్తించాలని ఆదేశాలు వచ్చాయి. మరోవైపు అరెస్టు సమయంలో సిరాజ్ వద్ద భారీగా పేలుడు పదార్థాలు లభించాయి. ఈ కేసు విషయంలో ఎన్ఐఏ అధికారులు విజయనగరం టూటౌన్ స్టేషన్‌కు వెళ్లారు. కేసుకు సంబంధించిన విషయాలపై అక్కడి పోలీసులతో ఎన్ఐఏ అధికారులు మాట్లాడారు. మరోవైపు సమీర్ కాంటాక్టులపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ఆపరేషన్ సిందూర్‌పై ముదే సమాచారం

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ గురించి ముందుగానే సమాచారం ఇవ్వడం వల్ల పాక్ అప్రమత్తం అయ్యిందని కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ కొట్టిపడేసింది. ఇది దుష్ప్రచారమని పేర్కొంది. ఇలాంటి వాటితో భారత్ పరువును ప్రతిష్టకు భంగం వాటిల్లగలదని తెలిపింది.

ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన తొలి దశలో పాక్ సహా ఇతర దేశాలకు సమాచారం ఇచ్చామని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపినట్లు పేర్కొంది. కానీ దాడికి ముందే ఈ సమాచారం బయటకు వెళ్లినట్లు- కాంగ్రెస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తుందని తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం జైశంకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పింది. భాజపా రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. రాహుల్ తమ ప్రభుత్వంపై నిందలు మోపాలనే దురుద్దేశంతోనే ఇటు-వంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. ఆపరేషన్ సిందూర్‌పై బ్రీఫింగ్ ఇస్తూ.. మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ చేసిన ప్రకటనను ఆ పార్టీ ఉటంకించింది. ఆపరేషన్ ప్రారంభించిన వెంటనే తాము ఉగ్రస్థావరాలపై దాడులు చేస్తున్నట్లు- పాక్‌కు చెప్పడానికి ప్రయత్నించగా.. భవిష్యత్తులో ఆ దాడులకు తాము తీవ్ర సమాధానం ఇస్తామని దాయాది దేశం చెప్పినట్లు- లెఫ్టినెంట్ జనరల్ పేర్కొన్నట్లు- భాజపా తెలిపింది. జైశంకర్ విదేశాల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఆయనపై ఇటు-వంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడింది. పీఐబీ సైతం కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చింది. కేంద్రమంత్రి ఈ ప్రకటన చేయలేదని తన ఫ్యాక్ట్‌చెక్‌లో పేర్కొంది.

రాహుల్ గాంధీ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ప్రారంభానికి ముందే ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లపై దాడి చేస్తున్నామని..

పాక్ సైన్యం వాటికి దూరంగా ఉండాలని భారత్ చెప్పినట్లు- జైశంకర్ పేర్కొన్నారని అన్నారు.

# యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో విస్తుపోయే నిజాలు

న్యూఢిల్లీ: గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి జరగడానికి కొన్ని నెలల ముందు ఆమె ఆ ప్రాంతాన్ని సందర్శించినట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాదు అక్కడ వీడియోలు తీసినట్లు కూడా అధికారులు గుర్తించారు. ఆ వీడియోలను పాక్ ఏజెంట్ల తో పంచుకున్నట్లు భావిస్తున్నారు. దీనిపై అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో హర్యానాకు చెందిన ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రాను అధికారులు శనివారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతి మల్హోత్రాకు సన్నిహిత సంబంధాలున్నట్లు- తెలిసింది. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి దాదాపు మూడు నెలల ముందు ఆమె తరచూ జమ్ము కశ్మీర్‌లో పర్యటించినట్లు- కూడా అధికారులు గుర్తించారు. ఒకసారి చైనాకు కూడా వెళ్లొచ్చినట్లు- తేలింది. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో ఆమె డానిష్‌తో టచ్‌లో ఉన్నట్లు- అధికారులు నిర్ధరించారు. జ్యోతిని అతడు ట్రాప్ చేసినట్లు- గుర్తించారు.ట్రావెల్ వ్లాగర్ జ్యోతి.. 'ట్రావెల్ విత్ జో' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నడుపుతోంది. కమిషన్ ఏజెంట్ల ద్వారా వీసా పొందిన జ్యోతి 2023లో పాక్‌ను సందర్శించింది. ఆమె ఎవరికీ అనుమానం రాకుండా పాక్ అధికారులకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు- తేలింది. ఈ కేసులో జ్యోతి మల్హోత్రా ట్రావెల్ వ్లాగర్‌తో కలిసి పని చేస్తున్నట్లు- గుర్తించారు. మరో ఐదుగురితో కలిసి ముఠాగా ఏర్పడి హర్యానా, పంజాబ్ నుంచి ఇన్ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నట్లు- అధికారులు పేర్కొన్నారు. మన దేశంలోని కీలక ప్రాంతాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌తో పంచుకున్నట్లు తేలింది. అంతేకాదు ఓ పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌తో సన్నిహితంగా మెలుగుతున్నట్లు- కూడా తేలింది. అతడితో ఆమె అంతర్జాతీయ ట్రిప్‌కు కూడా వెళ్లింది.





# కల్తీ మద్యం కేసులో ప్రత్యేక టాస్‌ఫోర్స్

**అమరావతి:** జంగారెడ్డి గూడెం కల్తీ మద్యం కేసులో ఏపీ ప్రభుత్వం ప్రత్యేక టాస్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో 2022 మార్చిలో కల్తీ మద్యం కారణంగా చోటు- చేసుకున్న మరణాలపై లోతుగా దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం ముగ్గురు అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు- చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బృందానికి ఏలూరు ఎస్పీ కిశోర్ నేతృత్వం వహించగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ వేణు ప్రభుకుమార్, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు సభ్యులుగా ఉంటారు. కల్తీ మద్యం కారణంగా చోటు- చేసుకున్న మరణాలకు సంబంధించి జంగారెడ్డి గూడెం పోలీస్‌స్టేషన్‌లో నాలుగు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల పరిస్థితిపైనా అధ్యయనం చేయాలని టాస్క్‌ఫోర్స్‌కు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరణాలపై లోతుగా అధ్యయనం చేసి, బాధ్యులెవరో గుర్తించాలని, సాంకేతికపరమైన సిఫార్సులు కూడా చేయాలని ఆదేశించింది. కల్తీ మద్యం కారణంగా దాదాపు 22 మంది అప్పట్లో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018
ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

# సంపాదకీయం

## ఎన్నికలకు ముందే గ్రామాలు బలపడాలి !

స్థానిక ఎన్నికలు ఇదిగో అదిగో అంటూ కాలం గడిపేస్తున్నారు. ఇప్పటికైతే ఎప్పుడు ఎన్నికలు జరుపు తారన్న గ్యారెంటీ లేదు. తమకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయా లేదా అన్న ధోరణిలో తెలుగు వల్లభులు లెక్కలు వేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో సానుకూల పరిస్థితుల కోసం చూస్తున్నారు. ఈ క్రమంలో వివిధ కార్యక్రమాలతో ప్రజల్లో మంచి మెప్పు పొందేలా కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే ఎవరు అధికారంలోకి వచ్చినా స్థానిక సంస్థలను బలోపేతం చేసి, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించడం లేదు. గ్రామస్థాయిలో కూడా పెత్తనం తమ చేతుల్లో ఉండేలా చూస్తున్నారు. వారు విధించే పన్నులను, పనులను వీరే చేస్తున్నారు. దీంతో గ్రామాలు ఆర్థికంగా బలపడడం లేదు. పెత్తనం తమ గుప్పిట్లో పెట్టుకుని సర్పంచ్‌లను దమ్మీలుగా గామర్చారు. గత జగన్ ప్రభుత్వం ఎపిలో సర్పంచ్‌లకు సమాంతరంగా వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టారు. చంద్రబాబు జన్మభూమి కమిటీలను పెట్టారు. ఇప్పుడు తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తామంటున్నారు. రాజీవ్ గాంధీ స్థానిక ప్రభుత్వాల బలోపేతం కోసం తీసుకుని వచ్చిన రాజ్యాంగ సవరణలను తుంగలో తొక్కుతున్నారు.

గ్రామిణ అర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా ఉన్న గ్రామలను అభివృద్ధి పరచి, సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా కార్యక్రమాలకురచన జరగడం లేదు. గ్రామస్థాయి నుంచి ప్రణాళిక సాగివుంటే గ్రామాలు బాగుపడి రాష్ట్రం, దేశం బగుపడేది. కానీ అలాంటి ఆలోచన కార్యరూపం దాల్చడం లేదు. అన్నీ సచివాలయం నుంచి సిఎంల పర్యవేక్షణలో జరగడం వల్ల గ్రామాలు వట్టిపోవడానికి కారణం అవుతున్నాయి. గ్రామస్థాయి లో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగడం లేదు. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేకపోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో పక్కాగా ప్రణాళికలు జరగడం లేదు. కేంద్రం నేరుగా నిధులు ఇవ్వడం ద్వారా గ్రామాలను బలోపేతం చేయాలని కేంద్రం ఆలోచన చేసినా అందుకు పాలకులు సిద్దంగా లేరు. వివిధ పథకాలతో చేస్తున్నపెత్తనాన్ని తగ్గించుకోవడం లేదు. గ్రామాలు చేయాల్సిన నిర్ణయాలను సచివాల స్థాయిలో తీసుకుంటున్నారు. ఎన్నికైన సర్పంచ్‌లను దమ్మీలుగా చేస్తూ..వారికి నిధులు కేటాయించకుండా..వారిని పనిచేయనీయ కుండా పెత్తనం చెలాయిస్తున్న తీరు వల్ల గ్రామాల సమగ్ర అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామాలకు ఏమి అవసరమన్నది గుర్తించి నిధులు విడుదలచేసి, అమలు చేయించేలా కార్యాక్రమాలు సాగివుంటే ఆర్థికవ్యవస్థ ఎప్పుడో బలోపేతం అయ్యేది. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడంతో పాటు ప్రణాళికలు సిద్దం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్దం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. గ్రామాలను పటిష్ట పాలనా కేంద్రలుగా తీర్చి దిద్దాలి. గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి ఉద్యోగులను పనిచేసేలా చేయాలి. అలాగే పనులకు సంబంధించి గ్రామాల్లో తీర్మానం చేయించి అమలు చేయించాలి. సిఎం స్థాయిలో కేవలం పర్యవేక్షణ మాత్రమే ఉండాలి. కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగేలా అవసరమైతే ప్రణాళికలను అమలు చేయాలి. అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. గ్రామాలను యూనిట్‌గా కార్యక్రమాల రచన సాగాలి. సర్పంచ్‌లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యులను చేయాలి. అప్పుడే ఏ పథకం అయినా ఆశించన ఫలితం సాధిస్తుంది. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగతమైన శ్రద్దకు సంబంధించినదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ద తక్కువనే చెప్పాలి. ఇప్పటికీ ఆరుబయట మల విసర్జన అన్నది అలవాటుగా కొనసాగుతోంది. నిత్యం టీవీల్లో పత్రికల్లో ప్రకటనల ద్వారా

ప్రజల్లో చైతన్యానికి కృషి చేస్తున్నా వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రజలు ఇందుకు కారణాలు అపరిశుభ్రత అని గ్రహించడం లేదు. వ్యక్తిగత మరుగుదొడ్ల కు 12వేల ఆర్థిక సాయం అందిస్తున్నా గ్రామాల్లో ప్రజలు వెంటనే మరుగదొడ్లు నిర్మించు కునేందుకు ముందుకు రావడం లేదు. దీనికి ప్రజలతో పాటు ప్రభుత్వాల వైఫల్యం కూడా ఉంది. గ్రామాలను యూనిట్‌గా చేసి సర్పంచ్‌లకు బాధ్యత అప్పగించి ఉంటే ఇది వందశాతం సక్సెస్ అయ్యి ఉండేది. కానీ గ్రామస్థాయిలో పనులకు సర్పంచ్ లను బాధ్యులను చేయక పోవడం వల్ల కార్యక్రమాలు విజయవంతం కావడం లేదు. గ్రామస్థాయిలో పని ఏదైనా సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించి గ్రామకమిటీ ద్వారా అమలు చేయాల్సి ఉంది. ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. దీంతో వ్యవస్థ బలోపేతం అవుతుంది. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పంచాయతీల్లో జనాభాకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పల్లెలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రధానంగా అన్ని పనులను ప్రభుత్వమే చేస్తుందన్న ధీమాలో ప్రజలు ఉన్నారు. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. మురుగుకాల్వల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేవారు లేనందున దుర్వాసన వెదజల్లు తుండటంతో పల్లె ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. రహదారుల్లోనే మురుగు నీరు ప్రవహిస్తుండటం దోమల బెడద తీవ్రం కావడంతో రోగాల బారిన పడుతున్నారు. అనేక అంటురోగాలు ప్రబలుతున్నాయి. మలేరియా, డెంగ్యూ విజృంభిస్తోంది. సర్పంచ్‌లు ఉన్నా లేకున్నా ఈ పనులను పెద్దగా పట్టించుకోవడంలేదు. ఇలాంటి సమస్యలనే ఇప్పుడు అధ్యయనం చేయాలి. గ్రామాలను బలోపేతం చేయాలి. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయారయ్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. సర్పంచ్‌లను,పంచాయితీల పాలకవర్గాలను విశ్వాసంలోకి తీసుకుని వారిని బాధ్యులను చేసినప్పుడే గ్రామాల రూపురేఖలు మారగలవు.సర్పంచ్‌లకు పూర్తిస్థాయి అధకారాలను దఖలు పరచాలి. నిధులు సకాలంలో విడుదల చేయాలి. అప్పుడే గ్రామాలు బలపడతాయి. ఎన్నికలకు ముందే ఈ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలి.

## శతాబ్దాల అనంతరం శ్రీవారికి అఖండాలు విరాళం

### రంగనాయకుల మండపంలో విరాళాన్ని అందించిన మైసూరు రాజమాత



**తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, మే 19.**

తిరుమల శ్రీవారికి మైసూరు రాజమాత శ్రీ ప్రమోదా దేవి రెండు భారీ వెండి అఖండాల(అఖండ దీపాలు)ను సోమవారం విరాళంగా అందించారు.ఈ అఖండాలు గర్భగుడిలో వెలిగించే సంప్రదాయ దీపాలు. సుమారు 300 సంవత్సరాల క్రితం అప్పటి మైసూరు మహా రాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు చరిత్రలో ఉంది. ఇప్పుడు మళ్లీ మైసూరు రాజమాత వాటిని సమర్పించడం విశేషం.ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోల బరువుంటుంది. తిరుమలలోని



రంగనాయకుల మండపంలో ఆమె ఈ భారీ వెండి అఖండాలను అందించారు.టీటీడీ ఛైర్మన్ శ్రీ బి.ఆర్. నాయుడు, అదనపు ఈవో శ్రీ సి.హెచ్. వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తిరుపతిలో ముమ్మరంగా హౌసింగ్ జియో ట్యాగింగ్ మేళా కమీషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, మే 19.**




రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా తిరుపతి నగర పరిధిలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. జియో ట్యాగింగ్ వెళ్ళే లబ్ధిదారుల వాహనాలను సోమవారం కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో తిరుపతి నగరంలో ఇంటి పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు చిందేపల్లి, ఎం.కొత్తపల్లి, కల్లూరు, లేఔట్లలో నిర్మిస్తున్న ఇళ్లకు జియో ట్యాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. మొత్తం 19,086 మంది లబ్ధిదారులకు గాను దాదాపు 10,000 వేల మందికి జియో ట్యాగింగ్ పూర్తయిందని, మిగతా పెండింగ్ లబ్ధిదారులకు ఈ 19, 20, 21 తేదీలలో మూడు రోజులపాటు 9086 మంది లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ మూడు రోజులలో ఎవరైనా వెళ్లకపోతే మిగతా రోజులలో లబ్ధిదారులు వారికి ఇచ్చిన ఇంటి పట్టా ఆధారంగా లేఅవుట్ కు వెళ్లి లబ్ధిదారులు జియో ట్యాగింగ్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హౌసింగ్ డిఈఈ లు మోహనరావు, శ్రీనివాస్, కుమార్, హౌసింగ్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటమరాజు, సెక్టోరల్ ఆఫీసర్లు, సచివాలయ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మామిడి ఫ్యాక్టరీ యజమానులకు బ్యాంకు వారు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలి.

### జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, మే 20 :**

సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుండి మామిడి ఫ్యాక్టరీ యజమానులకు బ్యాంకు వారు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, బ్యాంకు అధికారులతో కలిసి కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ పర్చువల్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మ్యాంగో పల్స్ ప్రాసెసింగ్ సంస్థలు గత రెండు సంవత్సరములుగా పల్స్(జ్యూస్) అమ్ముడుపోనందున చాలావరకు సంస్థల నందు నిల్వలు ఉన్నాయనిపేరుకు పోయిన నిల్వలు అధికంగా ఉన్నందున బ్యాంకు వారికి కట్టవలసిన. వడ్డీని 6 మాసములు పొడిగించవలసినదిగా గత సమావేశంలో కోరియున్నందున వారు కోరిన విషయాలను ప్రభుత్వ




చీఫ్ సెక్రటరీ వారితో మామిడి ప్రాసెసింగ్ యాజమాన్యం వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా వారు సానుకూలంగా స్పందించి ప్రత్యేక డిసిసి జరిపి ఈ అంశములను ఆమోదింపచేసి ప్రభుత్వానికి తెలియపరచ వలసినదిగా తెలిపి ఉన్నారని అన్నారు అందులో భాగంగా నేడు ప్రత్యేక డిసిసి సమీక్ష సమావేశంలో అందరూ బ్యాంకు అధికారులు పాల్గొనడం జరిగిందన్నారు ఈ సమీక్షలో అన్ని బ్యాంక్ అధికారులు మ్యాంగో పల్స్ ప్రాసెసింగ్ సంస్థలకు 6 మాసముల పాటు వడ్డీని పొడిగించుటకు బ్యాంకుల వారు ఆమోదం తెలిపి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారని తెలియజేసారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖాధికాదికారి దశరథ రామి రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ గుంటూరు రవికుమార్, ఇతర బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు


## పంచాయితీలను ఆర్ధికంగా ఆదుకోవాలి



హైదరాబాద్: పంచాయితీరాజ్ చట్టాన్ని బలోపేతం చేసి, గ్రామిణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కులవృత్తులను,గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొదిస్తే తప్ప మార్పు కానరాదని పలువురు ప్రముఖులు చెబుతున్నారు. గ్రామాలకు ముఖ్యంగా సర్పంచ్‌లకు విధులు,నిధులు ఇస్తేనే ఇది సాధ్యమని అంటున్నారు. గ్రామాలను యూనిట్‌గా చేసి కార్యక్రమాలను రూపొందించుకునే వెసలుబాటు సర్పంచ్‌లకు ఉండాలి. పల్లెల్లో ఏ పనులు చేయాలో సిఎం స్థాయిలో అధికారుల పర్యవేక్షణలోనే సాగుతోంది. గ్రామాల్లో సర్పంచ్‌ల బాధ్యత నామమాత్రంగా ఉంటోంది. వారికి బాధ్యత అప్పగిస్తే పన్నుల వసూళ్లు మొదలు కార్యక్రమాల అమలు వరకు వారికి స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. పనులు చేయని సర్పంచ్‌లను చట్టబద్దంగా శిక్షించేలా చట్టం రూపొందించిన ప్రభుత్వం నిధుల కోసం కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాల్లో పన్నులు ఇతరత్రా రూపంలో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదు. గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగితే తప్ప నిధులు సమకూరవు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామిలో పారిశుద్ధ్య పనులు చేర్చడంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. గ్రామాల పరిధిలో అన్నీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగేలా చట్టసవరణ జరగాలి. ఎన్నికలకు ముందే ఇవన్నీ నిర్ధారించాలి. తెలుగు రాష్ట్రాల సిఎంలు ఇందుకు పూనుకోవాలి. గ్రామాల్లో జరిగే ప్రతి పని పంచాయితీల ఆధ్వర్యంలో జరిగేలా, దాని పరిధిలోనే అధికారులు పనిచేసేలా చూడాలి. అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలపడడంతో పాటు కార్యక్రమాలు ముందుకు సాగుతాయి. గ్రామాలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. ఇకపోతే పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీల ఏర్పాటుతో పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది. పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న సర్కార్ నిర్ణయంతో గ్రామాల్లో పారిశుద్యం వెల్లివిరియనుంది. ఈ పథకంలో ఇప్పటి వరకు చేస్తున్న పనుల్లో గ్రామిణ పారిశుధ్యాన్ని జోడించడం ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలి. గ్రామాల నిధులు గ్రామాలకే చెందేలా చేయాలి. ఉపాధి హామీ పనుల్ని విస్తృతం చేయాలని, అందులో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ఉపాధి కూలీలతో నిర్వహించేలా చేస్తే నిధుల దుర్వినియోగం తప్పుతుంది. ఫలితంగా ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో మార్పు రానుంది. వాస్తవానికి పంచాయతీలకు లభించే సాధారణ నిధుల నుంచి 30 శాతం వరకు పారిశుద్యానికి ఖర్చు చేయాలనే నిబంధన గతంలో ఉండేది. తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. అంటే పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగం పారిశుద్యానికే వెచ్చిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడంలేదు. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేస్తే పంచాయతీలు బలోపేతం కావడంతోపాటు వాటికి ఆర్థిక భారం కూడా తప్పుతుంది. కొత్తగా ఉపాధి కూలీలను పారిశుద్ధ్య పనుల్లోకి తీసుకుంటే గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తరలించే వీలుంటుంది. ఈక్రమంలో అధికారులు పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీలను వినియోగించుకోవాల్సిన అసవరం ఉంది. ఇలాచేస్తే కూలీలకు పని దొరకడంతో పాటు పల్లెలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. గ్రామాల పరిధిలో కూలీలకు ఏ పని చూపించాలని భావిస్తున్న ఉపాధి సిబ్బందికి ఊరట కలుగనుంది. కూలీలకు పల్లెల్లోనే పారిశుద్ధ్య పనులు చూపించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనుల ద్వారా ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారిశుద్ధ్య పనులు చేయించాలనే ఆలోచన మంచి నిర్ణయమని పలువురు రాజకీయ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. దీనివల్ల పల్లెలు పరిశుభ్రంగా మారతాయి. పంచాయతీలకు ఆర్థికభారం తప్పుతుంది.గ్రామ పంచాయతీల్లో ఇదివరకే డంపింగ్ యార్డుల నిర్మాణ పనులను ఉపాధి కూలీలతో చేపడుతున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య పనులనూ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో కూలీలకు వంద రోజులు సమృద్ధిగా పనులు కల్పించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. అలాగే చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనులతో ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఉత్తేజిత దినపత్రిక

# అటుకులని అలా తింటూ.. ఇలా బరువు తగ్గండి..




అటుకులు.. చాలా మంది ఈజీగా చేసే స్నాక్స్‌లో అటుకులు కూడా ఒకటి. వీటితో పోహా, పాలల్లో కలిపి తినడం, దోశ, ఇడ్లీ పిండిల్లో కూడా వాడతారు. వీటిని తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. ఇవన్నీ మనకు తెలియకుండానే వీటిని ఇన్నిరోజులుగా తింటున్నాం. పూర్తి వివరాలు తెలుసుకోండి. ఫైబర్ కంటెంట్, ఐరన్ కంటెంట్, పొటాషియం వంటి వివిధ రకాల పోషకాలు శరీరానికి శక్తిని. కొలెస్ట్రాల్ కంట్రోల్ చేయడానికి హెల్ప్ చేస్తాయి.

ఇది ఇన్సులిన్ మోతాదు మెరుగైన వినియోగాన్ని కూడా నిర్ధారిస్తుంది. అందువల్ల, ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారాన్ని అనుసరించాలనుకునేవారికి అటుకులు బెస్ట్ ఆప్షన్.




కార్బోహైడ్రేట్స్ మన బాడీకి లభించే అత్యుత్తమ పోషకాల్లో ఒకటి. ఇది మన శరీర శక్తి స్థాయిలను పెంచుతుంది. మన శరీరాన్ని సైడ్ ఎఫెక్ట్స్‌కి దూరం చేస్తుంది. అటుకుల్లో ఎక్కువగా కార్బోహైడ్రేట్ కంటెంట్ ఉంటుంది. ఇది బాడీ వెయిట్‌ని బ్యాలెన్స్ చేస్తుంది. ఇది బరువు నియంత్రణలో అలాగే ఆక్సీకరణ ఒత్తిడిని బ్యాలెన్స్ చేయడంలో హెల్ప్ చేస్తాయి. ప్రాసెస్డ్ కార్బోహైడ్రేట్స్‌కి వ్యతిరేకంగా పనిచేస్తాయి. మంచి కార్బోహైడ్రేట్స్ తీసుకోవడం వల్ల మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



ఉదయాన్నే అటుకులతో తయారైన పోహా, దద్ధ్యోజనం వంటి ఫుడ్స్ తీసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. దీని వల్ల బరువు కూడా కంట్రోల్ అవుతుంది.

అటుకులు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుంది. ఈ అటుకులతో పండ్లు, కూరగాయలు, పెరుగు వంటివి కలిపి కూడా తీసుకోవచ్చు. అదే విధంగా , ఆరోగ్య నిపుణురాలు రిచా గంగాని ప్రకారం ఈ అటుకులు ఆరోగ్యానికి చాలా మంచిది. పోహా తిన్నప్పుడు త్వరగా జీర్ణమవ్వదు. ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంటుంది. అదే విధంగా, దీనిని పోహాలా చేసుకుని తినొచ్చు. అందులో ఎక్కువగా కూరగాయలు, పల్లీలు, బఠానీలు వేయాలి. అప్పుడు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇక వీటితో పాటు పాలు, పెరుగు కలిపొచ్చు. వీటితో పాటు పండ్లు కలిపి తినొచ్చు. కాబట్టి తక్కువగా ఉంటుంది. దీని వల్ల బరువు తగ్గుతారు. అదే విధంగా తక్కువ పరిమాణంలోనే తీసుకోవడం మంచిది. నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# ఈ 5 ఆహారాలు న్యాచురల్ స్కిన్‌కేర్‌గా పని చేస్తాయ్..!



సన్‌స్క్రీన్.. స్కిన్‌కేర్ కచ్చితంగా ఉండాల్సింది. వేసవికాలం, వర్షాకాలం.. ఏ సీజన్ అయినా సన్‌స్క్రీన్ కచ్చితంగా అప్లై చేసుకోవాలి. ముఖానికి ట్యాన్ పట్టకూడదన్నా, ఎండ ప్రభావానికి చర్మం పాడవకూడదన్నా... సన్‌స్క్రీన్‌లోషన్ రాసుకోవడం తప్పనిసరి. మనం సన్‌స్క్రీన్‌కు చాలా ఖర్చు చేస్తూ ఉంటాం. అయితే, మనం తీసుకునే ఆహారం కూడా సన్‌స్క్రీన్‌లా రక్షిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని ఆహారం పదార్థాలు.. విపరీతమైన వేడిని నివారించడంలో, మన చర్మాన్ని లోపల నుంచి రక్షించడానికి సహాయపడతాయి. మన చర్మాన్ని సూర్యరశ్మి నుంచి రక్షించుకోవడానికి ఎలాంటి డైట్ తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.?

మన ఆహారం సూర్యకిరణాలను నిరోధించడంలో ఎలా సహాయపడుతుంది?

మన ఆహారం సూర్యకిరణాలను నిరోధించడంలో ఎలా సహాయపడుతుంది?

మనం తీసుకునే ఆహారం.. చర్మ సంరక్షణకు కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అధిక నీటి కంటెంట్ ఉన్న ఆహారం మన డైట్‌లో చేర్చుకుంటే.. శరీరంలోని సోడియం, పొటాషియం, మాంగనీస్ కోల్పోయిన ద్రవం, పోషకాలను తిరిగి నింపడానికి తోడ్పడుతుంది. అధిక వాటర్ కంటెంట్ ఉన్న ఆహారాలు.. మన శరీరాన్ని హైడ్రేటింగ్‌గా ఉంచడానికి సహాయపడతాయి. సూర్యుని రేడియేషన్ నుంచి చర్మాన్ని రక్షించడానికి తోడ్పడతాయి, చర్మం టాన్ అవ్వకుండా కాపాడుతుంది, ఇది చర్మశుద్ధి, ఇతర అనారోగ్యాలను నివారిస్తుంది.









నిమ్మరసంలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి యూవీ కిరణాలను నుంచి చర్మాన్ని రక్షించడానికి తోడ్పడతాయి. నిమ్మరసంలోని విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది ఫ్రీరాడికల్స్ కారణంగా.. చర్మ కణాలు దెబ్బతినకుండా రక్షిస్తుంది.

గ్రీన్ టీలో మెండుగా ఉండే రెసిపెరిట్రాల్ పదార్థం శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతుంది. రక్తం గడ్డకట్టకుండా చూస్తుంది. దీంట్లోని యాంటీఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్, అమైనో యాసిడ్స్ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు హానికారక బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడతాయి. శరీరంలోని మలినాలను బయటకు పంపిస్తుంది. అలర్జీలతో పోరాడుతుంది. గ్రీన్ టీలోని యాంటీఆక్సిడెంట్లు.. సూర్యరశ్మి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి.

మజ్జిగలో పోషకాలు అధికంగా ఉంటాయి. మజ్జిగలో సోడియం, క్యాల్షియం మూలకాలు మెండుగా ఉంటాయి. వీటితోపాటు ప్రొటీన్లు, మినరల్స్ కూడా. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని, పోషకాలను అందిస్తాయి. మజ్జిగ శరీరంలో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపించేస్తుంది. అలాగే జీవక్రియ రేటును పెంచి బరువు నియంత్రణకు తోడ్పడుతుంది. దీనిలోని పోషకాలు సూర్యకిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఇది ముడతలు, ఫైన్ లైన్లను నివారిస్తుంది.

టమాటాలోని లైకోపీన్, రేడియేషన్‌లను గ్రహిస్తుంది. సన్‌బర్న్ ప్రమాదాలను నివారిస్తుంది. టమాటాలోని యాంటీఆక్సి డెంట్లు.. సూర్యకిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి.

కొబ్బరి నీళ్లను సహజమైన మాయిశ్చరైజర్ అని పిలుస్తుంటారు, ఇది చర్మానికి పోషణ అందిస్తుంది. కొబ్బరి నీళ్లు రోజూ తాగితే చర్మం మృదువుగా, తేమగా ఉంచుతాయి. కొబ్బరి నీళ్లలోని పోషకాలు.. చర్మంలోని మలినాలను తొలగించి స్కిన్ టోన్‌ని మెరుగుపరుస్తుంది, సూర్యరశ్మి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం.

# ఫ్యాషన్‌గా కనిపించాలనుకుంటే...





ఫ్యాషన్ ప్రపంచంలో ఆడవారికి ప్రత్యేక స్థానం ఉంటుంది. వారి వయసు పెరిగినా కూడా చూడడానికి ఫ్యాషన్‌గా కనిపించాలని వారు ఎంచుకునే ప్రతి వస్తువును అందంగా యూనిక్‌గా ఉండాలని చూసుకుంటుంది.

మరీ ముఖ్యంగా యాక్సెసరీస్, బట్టల ఎంపిక విషయంలో కొన్ని టిప్స్ ఫాలో అవుతారు. ఇందులో మహిళలు ధరించే నగలు, హెయిర్ స్టైల్స్, హ్యాండ్ బ్యాగ్స్, బట్టలు, వాచెస్, హై హీల్స్ ఇలా ఎన్నో.. ఎన్నెన్నో ఉంటాయి. అయితే.. ఇలాంటి వాటిలో మరికొన్ని వస్తువులు కూడా మీరు ఫ్యాషన్‌గా కనిపించేందుకు హెల్ప్ చేస్తాయి. అవేంటో చూద్దాం.

గతంలో ఒడ్డాణాలు ఉండేవి. అవే కాస్త మోడ్రన్‌గా మారి స్లిమ్ బెల్ట్, హిప్ బెల్ట్‌గా వచ్చాయి. దీని వల్ల బాడీషేప్ చక్కగా కనిపిస్తుంది. అటూ సాంప్రదాయమైన డ్రెస్సెస్, ఇటు మోడ్రన్ డ్రెస్సెస్.. ఇలా ఎలాంటి డ్రెస్సెస్‌పైనా కూడా సెట్ అయిపోతాయి. ఇవి బ్లేజర్స్‌పై కూడా బాగుంటాయి. ప్రజెంట్ మార్కెట్లో చాలా మోడల్స్, మెటల్స్ ఇలా ఎలా అయినా దొరుకతాయి. అయితే బ్లేజర్స్‌పై వాడాలంటే బ్లాక్, హాఫ్ వైట్‌లోవి ఎంచుకోవచ్చు.

చీరలు కట్టుకున్నప్పుడు ఇలా రెడీ అయితే లుక్ అదిరిపోద్ది.. సన్ గ్లాసెస్ అటూ ఫ్యాషన్‌గా కనిపిస్తూనే ఇటు కళ్ళని కూడా కాపాడుతుంది. ఇది చాలా మంది కేవలం బీచెస్‌కి వెళ్ళినప్పుడు మాత్రమే పెట్టుకుంటారు. కానీ, అలా కాదు ఎండలో బయటికి వెళ్ళినప్పుడు ఎప్పుడైనా వేసుకోవచ్చు. అయితే, అందుకోసం మీరు చక్కగా మీకు సూట్ అయ్యే సన్ గ్లాసెస్‌ని ఎంచుకోవచ్చు. వాచెస్ కూడా మీ ఫ్యాషన్ ట్రెండ్‌ని పెంచుతాయి. మనలో చాలా మంది డ్రెస్సెస్‌కి సూట్ అయ్యే వాచెస్‌ని పెట్టుకుంటారు. దీని వల్ల మరింత ఫ్యాషన్‌గా కనిపిస్తారు. అందుకోసం మీరు మంచి అందమైన, బ్రాండెడ్ వాచెస్ ఎంచుకోవచ్చు. ఈ మధ్యకాలంలో చాలా మంది స్మార్ట్ వాచెస్ వాడుతున్నారు. అలా అయినా వాడొచ్చు. లేదా బ్రాస్‌లెట్స్‌ని కూడా ట్రై చేయొచ్చు అదే విధంగా నెక్‌పీస్, బ్యాంగిల్స్, చెవిపోగులు కూడా మనల్ని ఫ్యాషన్ ఐకానిక్‌గా కనిపిస్తాయి. చెవులు, చేతులు, మెడపై ఇలా వీటిని కూడా స్టేట్‌మెంట్ పీసెస్ ఎంచుకోండి. ముక్కెర పెట్టుకోవాలనుకుంటున్నారా.. ఇలాంటివి బావుంటాయ్.. హ్యాండ్ బ్యాగ్స్.. హ్యాండ్ బ్యాగ్స్ అనేవి కూడా మీ ఫ్యాషన్‌ని ఎలివేట్ చేస్తాయి. కాబట్టి, మంచి హ్యాండ్ బ్యాగ్ ట్రై చేయండి. ఇందులో బ్రాండ్‌వి అయితే బావుంటాయి. అందుకోసం డబ్బు ఎక్కువగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదండి.. మన బడ్జెట్‌ని కూడా ఎంచుకోవచ్చు. అదే విధంగా, ఒకటే బ్యాగ్ కాకుండా ఓ రెండు మూడు కొని పెట్టుకోండి. అవి అకేషన్‌ని బట్టి స్టైల్ చేయొచ్చు. ఇందులో మీ బ్యూటీ ప్రోడక్ట్స్‌ని కూడా ఈ బ్యాగులోనే పెట్టుకు నేలా ప్లాన్ చేయండి. అందుకోసం ముందుగానే అన్ని ఆలోచించి వాటిని కొనడం మంచిది.

# పిల్లలకి మసాజ్ చేసే ఆయిల్‌ని ఇంట్లోనే తయారుచేయండిలా





సాధారణంగా పిల్లలకి స్నానం చేయించే ముందు నూనెతో మసాజ్ చేస్తారు. దీని గురించి బయట నుంచి కొనుక్కొని మసాజ్ చేస్తారు. అలా బయట నుంచి తీసుకొచ్చింది కాకుండా ఇంట్లోనే

పిల్లల జుట్టు, స్కిన్ పెద్దలతో పోలిస్తే డిఫరెంట్‌గా ఉంటాయి. వారు వాడే ప్రోడక్ట్స్‌లో ఏదైనా కెమికల్స్ ఉంటే అది స్కిన్, హెయిర్‌పై నెగెటీవ్ ఎఫెక్ట్స్‌ని చూపిస్తాయి. పిల్లలకి బాత్ ఆయిల్స్ ప్రోడక్ట్స్ తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

నేడు మార్కెట్లో చాలా ప్రోడక్ట్స్ అందుబాబులో ఉంటున్నాయి. అవన్నీ కూడా ఎంత వరకూ సురక్షితమో తెలుసుకోవాలి. అందుకే, ఎలాంటి కెమికల్స్ లేకుండా ఇంట్లోనే తయారు చేయాలి.

బేబి హెయిర్ ఆయిల్‌ని తయారు చేసేందుకు ముందుగా ఆముదం తీసుకోండి. అదే విధంగా, స్వచ్ఛమైన ఆలివ్ ఆయిల్ ఓ కప్పు తీసుకోండి. అందులో మీకు కావాలంటే ఓ చుక్క లావెండర్ ఆయిల్ కలపండి. వీటన్నింటిని బాగా కలపండి. ఇలా తయారైన ఆయిల్‌ని బేబి స్కిన్, హెయిర్‌కి కూడా అప్లై చేయొచ్చు.

ఇవి గుర్తుపెట్టుకోండి.. ఈ నూనెని తయారు చేయడానికి మీరు కొబ్బరి నూనెతో పాటు ఆలివ్ ఆయిల్‌ని వాడినప్పుడు అవి స్వచ్ఛమైనవే తీసుకోవాలి. ఇందుకోసం కొబ్బరినూనెని ఇంట్లోనే తయారు చేయొచ్చు. ఇవి స్వచ్ఛంగా లేకపోతే చాలా చర్మ సమస్యలు వస్తాయి.

డబుల్ బాయిల్.. బేబి ఆయిల్ అప్లై చేసేటప్పుడు డబుల్ బాయిల్డ్ మెథడ్‌లో ఆయిల్‌ని వేడి చేయండి. చాలా మంది ఓ గిన్నెలో నేరుగా వేడి చేస్తారు. కానీ, అస్సలు అలా చేయొద్దు. డబుల్ బాయిల్ మెథడ్‌లో నూనె వేసి వేడి చేసి దాంతో మసాజ్ చేయండి. ఇలా తయారుచేసిన నూనెని ఓ గాజు సీసాలో ఉంచండి. ప్లాస్టిక్ బాటిల్‌లో పెట్టకపోవడమే మంచిది. అలాగే ఆయిల్‌ని ఎండలో పెట్టండి. పెద్దవారు ఏదైనా బ్యూటీ ప్రోడక్ట్ వాడే ముందు ప్యాచ్ టెస్ట్ చేస్తాం. కొంచెం తీసుకుని చేతికి రాస్తారు. అలానే ఇప్పుడు రాయండి. ఏం ఇబ్బంది లేకపోతే అప్పుడు మాత్రమే వాడండి. వాడే ముందు కూడా ఓ సారి వారి చేతిపై కాస్తా రాసి చూడండి. ఎలాంటి సమస్య రాకపోతే అప్పుడు జుట్టుకి, చర్మంపై మసాజ్ చేసి స్నానం చేయించండి. అయితే ఎక్కువ రోజులు నూనెని వాడొద్దు. ఎప్పటికప్పుడు తాజాగా తయారు చేసిన నూనెని మాత్రమే వాడండి. అయితే, ఇవన్నీ కూడా స్వచ్ఛమైనవి వాడితే మరీ మంచిది.





# పిల్లల్ని ఇలా అస్సలు కూర్చోనివ్వకండి..



మనం కూర్చునే పొజిషన్‌ని బట్టి కూడా హెల్త్ కండీషన్ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పిల్లలు ఒక్కోసారిఆకారంలో కూర్చుంటారు. అలాంటప్పుడు ఏం జరుగుతుంది.. ఏమైనా సమస్యలొస్తాయా.. రాకుండా ఏం చేయాలో తెలుసుకోండి.

పిల్లలకి ఎన్నో అలవాట్లు ఉంటాయి. వారు తెలిసి తెలియక చేసే కొన్ని పనులు పెద్దవారికి చాలా ఇష్టం. వారి బుజ్జి బుజ్జి మాటలు, బుడి బుడి నడకలు, కాస్తా తింగరి చేష్టలు ఇలాంటివన్నీ కూడా వారు ఎదుగుతున్న క్రమంలో పెద్దవారు బాగా ఎంజాయ్ చేస్తారు.

పిల్లలు కూర్చునే విధానంలో చాలా కొత్తదనం ఉంటుంది. ఒక్కోరోజు ఒక్కోలా కూర్చుంటారు. అలా కూర్చునే విధానంలో %ఔ% ఆకారంలో కూర్చుంటారు. ఇది కాస్తా వింతగా ఉన్నా మనకి ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఇలా పిల్లలు కూర్చోగలరు కానీ, పెద్దలు కూర్చోలేరు. పిల్లలు ఎంతసేపైనా ఇలా కూర్చోగలరు. కానీ, నిజానికి అస్సలు అలా కూర్చోకూడదని చెబుతున్నారు నిపుణులు. ఇలా కూర్చుంటే వెంటనే వారిని అలా కూర్చోకూడదని తెలియజేయాలి. ఏం జరుగుతుందంటే.. కొంత మంది పిల్లలు కాస్తా తక్కువ సమయం ఇలా కూర్చుంటే.. మరికొంత మంది పిల్లలు ఎక్కువసేపు ఇలా కూర్చుంటారు. అయితే, ఇదే అలవాటుగా మారితే అది వారి శరీర ఆకృతి, కదలికలపై కూడా ప్రభావం చూపుతుంది. ఇలా కూర్చున్నప్పుడు కండరాలు బలపడవు. ఎందుకంటే ఈ భాగంలోని కండరాలు ఎలాంటి పనిచేయవు. ఇలా కూర్చుంటే వెన్నెముక కండరాలు బలహీనమవుతాయి. ఈ పోశ్చర్ కారణంగా కండరాలు వంకరగా మారతాయి.

ఈ పోశ్చర్‌లో కూర్చున్న పిల్లలకి ఎముకలకి సంబంధించిన వ్యాధులు, యాంటీరియర్ క్రూసియేట్ లిగమెంట్ సమస్యలు, వెన్నునొప్పి మొదలైన సమస్యలొస్తాయి. కూర్చున్నప్పుడు బ్యాలెన్స్ తగ్గుతుంది. దీంతో ఎదుగుదల ఉండదు. నడిచేటప్పుడు పాదాల ఎదుగుదల ఉండదు. నడుము సమస్యలు, నడుము బలహీనంగా మారడం, కండరాల బలహీనమవ్వడం వంటి సమస్యలొస్తాయి. సెరిబ్రల్ పాల్సీ ఉన్న పిల్లలు, బ్రెయిన్ ఎదుగని పిల్లలు, తొడ కండరాల సమస్యలు ఉన్న పిల్లలు కూడా ఈ విధంగా కూర్చుంటారు.

పిల్లలు ఇలా కూర్చున్నప్పుడు వెంటనే వారికి చెప్పి మామూలుగా కూర్చోమని చెప్పాలి. అదే విధంగా, బయటకి వెళ్ళి ఆడుకోమనండి. ఎక్కువసేపు ఒకే పోశ్చర్‌లో కూర్చోకుండా చూడండి.

అవసరమనుకుంటే డాక్టర్స్ హెల్ప్ తీసుకోండి. పిల్లలు ఈ పొజిషన్‌లో కూర్చోకుండా చూడండి. ఒక్కసారిగా ఈ అలవాటుని దూరం చేయాలంటే కష్టం. కానీ, మెల్లిమెల్లిగా ఈ అలవాటుని దూరం చేయండి.

ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# అబార్షన్ కావాలని ట్యాబ్లెట్స్ వాడుతున్నారా..

అబార్షన్ చేయించుకునేందుకు నేడు ఎన్నో మార్గాలు ఉన్నాయి. ఇందులో ట్యాబ్లెట్స్ వేసుకోవడం కూడా ఓ పద్ధతి. దీని గురించి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో పూర్తి వివరాలు తెలుసుకోండి. కొంతమంది పిల్లలు అప్పుడే వద్దనుకుంటారు. అలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అయినా ప్రెగ్నెంట్ అయితే.. ముందుగా డాక్టర్‌ని సంప్రదించాలి. అంతేకానీ, సొంత వైద్యం వాడొద్దు. వీటితో పాటు ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలో వర్తుర్ మణిపాల్ హాస్పిటల్ గైనకాలజీ కన్సల్టెంట్ డా. హీరా మర్ది మాటల్లో తెలుసుకోండి. గర్భస్రావం అనేది గర్భంలో ఏర్పడిన పిండాన్ని తీసేయడం. ఇందుకోసం డాక్టర్స్ 10 వారాల వరకూ గర్భాన్ని తొలగించడానికి ట్యాబ్లెట్స్‌ని ఇస్తారు. దీని వల్ల గర్భస్రావం తగ్గుతుది. మొదటి ఏడు వారాల్లోపు మాత్రల తో గర్భాన్ని తొలగించడం అవుతుంది.ప్రకారం, మాత్రల్ని వాడి గర్భంలో 7 వారాల, 49 రోజుల్లోగా గర్భ స్రావం చేయొచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థల ప్రకారం, వైద్య గర్భ స్రావానికి 10 వారాల సమయం ఉంటుంది. కానీ, ఇది డాక్టర్స్ మాత్రమే పరీక్షించి చెబుతారు. సాధారణంగా, ఈ సందర్భంల ఎన్ని వారాలు గడిచిపోయాయో తెలుసుకోవడానికి లాస్ట్ పీరియడ్స్ గుర్తుపెట్టుకోవాలి. డాక్టర్స్ ప్రకారం, మీరు నివసిస్తున్న ప్రదేశాలు బట్టి కూడా చట్టాలు భిన్నంగా ఉంటాయి. డాక్టర్స్ సూచించిన ప్రకారం మెడిసిన్ తీసుకుంటే మంచిది. అయితే, ఈ మెడిసిన్ తీసుకునేటప్పుడు మీరు కొన్ని సమస్యల్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. అవి హార్మోన్ల మార్పులు, తిమ్మిర్లు, నొప్పులు ఉంటాయి. పీరియడ్స్ టైమ్‌లో బ్లీడింగ్ నార్మల్ కంటే ఎక్కువగా ఉంటుంది. ఇది మాత్రమే కాదు. రక్తస్రావం మరికొన్ని రోజులు ఎక్కువగా ఉండొచ్చు. కొందరికి విపరీతమైన వికారం, అలసట, బలహీనత కూడా ఉంటుంది. ఇది కొద్దిగా ఉంటాయి. చాలా రోజుల పాటు సమస్య ఉంటే డాక్టర్‌ని సంప్రదించడం మంచిది. మీరు అబార్షన్ గురించి వెళ్ళినప్పుడు డాక్టర్స్ అవసరమైన చర్యలు తీసుకుంటారు.



# పసిడి సరికొత్త రికార్డ్.. బంగారం @ 96,000

దిల్లీ: అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరమవుతుండడంతో సురక్షిత పెట్టుబడిగా భావించి పసిడిపై పెట్టుబడులు మళ్లిస్తున్నారు. అంతర్జాతీయ ధరను అనుసరించి దేశీయంగానూ దీని ధరకు రెక్కలు వస్తున్నాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ఒక్క రోజులోనే రూ.1650 మేర పెరిగి రూ.96,100ను తాకింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి సైతం రూ.1650 మేర పెరిగి రూ.97,650కు పెరిగింది.

సాయంత్రం 4.30 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి రూ.96,700కు చేరింది. అటు వెండి ధర సైతం కిలోకు ఒక్క రోజులో రూ.1900 మేర పెరిగి రూ.99,400కు చేరింది. మంగళవారం కిలో వెండి రూ.95,500 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా చూసినప్పుడు ఇంట్రాడేలో గరిష్ఠంగా ఔన్సు 3,318 డాలర్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. ప్రస్తుతం 3,296 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

అమెరికా, చైనా మధ్య గత కొన్ని రోజులుగా సుంకాల విషయంలో ఘర్షణ నెలకొన్న సంగతి తెలిసిందే. పరస్పరం టారిఫ్‌లు విధించుకోవడంతో పాటు ఎగుమతుల విషయంలోనూ ఆంక్షలు విధించుకుంటున్నాయి. ఈ అనిశ్చితులు కొనసాగుతున్నంత వరకు బంగారానికి డిమాండ్ కొనసాగుతుందని అనలిస్టులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు డాలర్ ఇండెక్స్ బలహీన పడడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న ముందస్తు అంచనాలు కూడా బంగారం ధర పెరగడానికి కారణమని పేర్కొంటున్నారు.






## 247 మిలియన్ల ప్రకటనలపై గూగుల్ వేటు!

టెక్ దిగ్గజం గూగుల్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ద ఎత్తున ప్రకటనదారుల ఖాతాల్ని సస్పెండ్ చేసింది. డిజిటల్ యాడ్స్ ఎకోసిస్టమ్‌ను విశ్వసనీయంగా ఉంచే ప్రయత్నంలో భాగంగా ఈ కీలక అడుగు వేసింది. ప్రకటన విధాన నిబంధనల్ని ఉల్లంఘించిన కారణంగా 2024లో భారత్‌లో ఏకంగా 247.4 మిలియన్ల యాడ్స్‌ను తొలగించింది. 2.9 మిలియన్ల అడ్వర్టైజర్ ఖాతాలను సస్పెండ్ చేసినట్లు కంపెనీ తన నివేదికలో పేర్కొంది.

ప్రపంచవ్యాప్తంగా గూగుల్ 39.2 మిలియన్లకు పైగా ప్రకటనదారుల ఖాతాలను సస్పెండ్ చేసింది. 5.1 బిలియన్ ప్రకటనల్ని తొలగించినట్లు కంపెనీ తన వార్షిక యాడ్స్ సేఫ్టీ రిపోర్ట్‌లో తెలిపింది. గూగుల్ ప్రకటన విధాన నిబంధనల ఉల్లంఘనల జాబితాలో ఆర్థిక సేవలకు సంబంధించిన యాడ్స్ ముందు వరుసలో ఉన్నాయి. ట్రేడ్ మార్క్ ఉల్లంఘనలు, యాడ్స్ దుర్వినియోగం, జూదం, గేమ్స్‌కి సంబంధించిన ప్రకటనలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో డిజిటల్ లావాదేవీలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఇటువంటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, బ్రాండ్ దుర్వినియోగం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వినియోగదారులకు హాని కలిగించే ప్రకటనల్ని నిషేధిస్తూ గూగుల్ చర్యలు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. నిరంతం పెరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు తమ సామర్థ్యాలను పెంచుకున్నట్లు గూగుల్ తెలిపింది. ముఖ్యంగా ఏఐ వీడియోల ప్రకటనలు పెరిగాయని ఈ సందర్భంగా పేర్కొంది. మోసాలను ప్రోత్సహించే ప్రకటనదారులను సస్పెండ్ చేసేందుకు 100 మందికి పైగా నిపుణుల బృందం కృషి చేశారని తెలిపింది. ఫలితంగా 7 లక్షలకు పైగా నేరపూరిత ప్రకటనదారుల ఖాతాల్ని శాశ్వతంగా నిలిపివేసినట్లు పేర్కొంది. దీంతో గతేడాదిలో ఈ తరహా స్కామ్ ప్రకటనలు 90 శాతం తగ్గాయని వెల్లడించింది.

## 'ఎక్స్'కు పోటీగా సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్.. ఓపెన్‌ఏఐ కసరత్తు



చాట్‌జీపీటీ మాతృ సంస్థ ఓపెన్‌ఏఐ త్వరలో సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ను తీసుకురావాలని చూస్తోంది. 'ఎక్స్' లాంటి సామాజిక మాధ్యమ వేదికను పరిచయం చేయాలని చూస్తోందని సమాచారం. దీనికోసం ఇప్పటికే కసరత్తులు మొదలయ్యాయి. సంబంధిత వ్యక్తులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు పలు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

ఓపెన్‌ఏఐ కొత్త సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ఇంకా అభివృద్ధి దశలోనే ఉందని తెలుస్తోంది. కంపెనీ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఈ ప్రాజెక్ట్ కోసం బయటివ్యక్తుల నుంచి అభిప్రాయాల్ని ప్రైవేట్‌గా కోరుతున్నట్లు సమాచారం. అయితే ఈ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ను స్వతంత్రంగా తీసుకొస్తారా? లేదా చాట్‌జీపీటీలో విలీనం చేస్తారా? అనే విషయం తెలియలేదు.

## విప్రో లాభంలో 26% వృద్ధి..
# ఒక్కో షేరుపై 6 డివిడెండ్




ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో కంపెనీ రూ.3,569.6 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో నమోదైన లాభంతో పోలిస్తే 25.9 శాతం వృద్ధి చెందింది. అదే సమయంలో ఆదాయం రూ.22,208.3 కోట్ల నుంచి 1.3 శాతం పెరిగి రూ.22,504.2 కోట్లకు చేరిందని తెలిపింది.

పూర్తి ఆర్థిక సంవత్సరానికి విప్రో నికర లాభం 18.9 శాతం పెరిగి రూ.13,135.4 కోట్లుగా నమోదైంది. ఆదాయం 0.74 శాతం క్షీణించింది. ప్రపంచవ్యాప్త అనిశ్చితుల మధ్య 2026 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో విప్రో ఆదాయంలో 3.5 శాతం వరకు క్షీణత నమోదయ్యే అవకాశం కంపెనీ సీఈఓ, ఎండీ శ్రీనివాస్ పల్లియా అన్నారు. ఎన్ని సవాళ్లు ఉన్నప్పటికీ స్థిరమైన వృద్ధిపై దృష్టి సారించినున్నట్లు పేర్కొన్నారు.

గతేడాదిలో 2,32,614గా ఉన్న కంపెనీ ఉద్యోగుల సంఖ్య 2,33,346కి పెరిగింది. అయితే 2026 ఆర్థిక సంవత్సరంలో నియామక వివరాలను పేర్కొనలేదు. త్రైమాసిక ఫలితాల సందర్భంగా ఒక్కో షేరుకు రూ.6 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మార్కెట్ ముగిసే సమయానికి విప్రో షేరు విలువ ఎన్ఎస్ఈలో 1.48 శాతం పెరిగి రూ.247.60గా ఉంది.

## హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బాటలోనే ఐసీఐసీఐ బ్యాంక్




ప్రముఖ ప్రైవేటు రంగ బ్యాంక్ ఐసీఐసీఐ సేవింగ్స్ ఖాతా డిపాజిట్లపై వడ్డీ రేట్లలో కోత విధించింది. వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. సవరించిన వడ్డీ రేట్లు నేటి (ఏప్రిల్ 16) నుంచే అమల్లోకి రానున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా రెపో రేటును తగ్గించడంతో పలు బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీ రేట్లను రేట్లనూ తగ్గించడం ప్రారంభించాయి. ఇప్పటికే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించాయి. తాజాగా ఐసీఐసీఐ బ్యాంక్ ఇదే జాబితాలో చేరింది. ఆ బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం.. రూ.50 లక్షల వరకు నిల్వలపై 2.75 శాతం వడ్డీని అందించనుంది. గతంలో ఇది 3 శాతంగా ఉంది. ఇక రూ.50 లక్షల కంటే ఎక్కువగా ఉంటే 3.25 శాతం వడ్డీ చెల్లించనుంది. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ కూడా ఇంతే మొత్తం వడ్డీ చెల్లిస్తున్నాయి.

## ఎస్‌బీఐ- టాటా డిజిటల్ కాంబోలో క్రెడిట్ కార్డ్

దేశంలోనే అతిపెద్ద క్రెడిట్‌కార్డు జారీ సంస్థ ఎస్‌బీఐ కార్డ్, టాటా డిజిటల్ కలిసి టాటా న్యూ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డును లాంచ్ చేశాయి. అన్ని రకాల కొనుగోళ్లపై రివార్డులు అందించేలా ఈ క్రెడిట్ కార్డును డిజైన్ చేశారు. ఈ కార్డు టాటా న్యూ ఇన్ఫినిటీ ఎస్‌బీఐ కార్డ్, టాటా న్యూ ప్లస్ ఎస్‌బీఐ కార్డ్ వేరియంట్లలో లభిస్తుంది.

దేశీయంగా, అంతర్జాతీయంగా ఈ కార్డుతో జరిపే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కొనుగోళ్లపై కస్టమర్లకు రివార్డులు లభిస్తాయి. టాటా న్యూ ఇన్ఫినిటీ ఎస్‌బీఐ కార్డుపై గరిష్ఠంగా 10 శాతం, టాటా న్యూ ప్లస్ ఎస్‌బీఐ కార్డుపై గరిష్ఠంగా 7 శాతం చొప్పున రివార్డులు పొందొచ్చు. బిల్లింగ్ అనంతరం ఈ రివార్డు కాయిన్స్ (ఒక కాయిన్ = రూ.1) టాటా న్యూ యాప్‌లో న్యూపాస్ అకౌంట్‌లో జమ అవుతాయి. వీటిని వివిధ ఉత్పత్తుల కొనుగోలు, సేవలకు వినియోగించుకోవచ్చు.




యూపీఐ ద్వారా చేసే రోజువారీ పేమెంట్లకు కూడా ఈ కార్డులపై 1.5 శాతం వరకు (రూపే వేరియంట్‌పై) రివార్డులు లభిస్తాయి. టాటా న్యూ ద్వారా చేసే బిల్ పేమెంట్లపై 5 శాతం వరకు క్యాష్ బ్యాక్ పొందొచ్చు. ఆన్‌లైన్‌లో ఎస్‌బీఐ కార్డ్.కామ్ వెబ్‌సైట్ లేదా ఆఫ్‌లైన్‌లో క్రోమా స్టోర్లలోని కియోస్కల వద్ద ఈ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. టాటా న్యూ మొబైల్ యాప్, టాటా న్యూ వెబ్‌సైట్ లేదా టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, బిగ్ బాస్కెట్, క్రోమా, తాజ్ హోటల్స్, టాటా క్లిక్, టాటా 1ఎంజీ, టైటాన్, తనిష్క్, వెస్ట్‌సైడ్ తదితర పార్ట్‌నర్ బ్రాండ్ల కొనుగోళ్లపై పెద్ద మొత్తంలో రివార్డులు పొందొచ్చు.

# నిస్సాన్ నుంచి డ్రైవర్‌లెస్ కార్లు



ప్రముఖ వాహన తయారీ సంస్థ నిస్సాన్ త్వరలో డ్రైవర్ లెస్ కార్లను తీసుకురానుంది. ప్రస్తుతం మార్కెట్లో వీటి ట్రెండ్ నడుస్తున్న వేళ ఈ సెగ్మెంట్‌లోకి ఎంట్రీ ఇవ్వాలని చూస్తోంది. అందులో భాగంగానే తన తదుపరి తరం అటానమస్ డ్రైవింగ్ టెక్నాలజీతో కూడిన తొలి కారును 2027 ఆర్థిక సంవత్సరం నాటికి తీసుకురానున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ అటానమస్ డ్రైవింగ్ టెక్నాలజీని 'ప్రోపైలట్ టెక్నాలజీ'గా నిస్సాన్ పేర్కొంటోంది. నెక్స్ట్ జనరేషన్ లిడార్, వేవ్ AI డ్రైవర్ సాఫ్ట్‌వేర్‌తో ఈ కారు పనిచేస్తుంది. ఈ ఏఐ డ్రైవర్ సాఫ్ట్‌వేర్ అత్యంత సంక్లిష్టమైన సమయంలోనూ మనిషిలా విధిని నిర్వహిస్తుందని నిస్సాన్ పేర్కొంది. ఇది రియల్–టైమ్ రికగ్నైజేషన్ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

కారులో సాఫీగా ప్రయాణిస్తున్న సమయంలో అకస్మాత్తుగా ముందున్న వాహనం బోల్తాపడటం, ఏదైనా సంఘటనతో ఎదురుగా వస్తున్న వాహనం సడన్‌గా ఆగిపోవడం వంటి సంఘటనలు జరుగుతుంటాయి. ఇలాంటి సమయంలో వాహనంలోని సాంకేతికత సాయంతో వెంటనే పరిస్థితిని అర్థం చేసుకొని ప్రమాదం బారిన పడకుండా వాహనాన్ని చాకచక్యంగా నడుపుతుంది. పైనుంచి పడే వస్తువులను గుర్తించేందుకు ఇందులోని 3D స్పేస్ రికగ్నైజేషన్ సాయపడుతుంది. వేవ్ ఏఐ అనేది డ్రైవింగ్ కోసం ఏఐని రూపొందించేందుకు పనిచేస్తున్న అంతర్జాతీయ కృత్రిమ మేధ సంస్థ. రియల్ వరల్డ్ డేటా, జెన్‌ఏఐ టెక్నాలజీ సాయంతో ఈ ఏఐ మోడల్‌ను అభివృద్ధి చేశారు.

# యాంటీ ట్రస్ట్ ట్రయల్.. 1 బిలియన్ డాలర్లతో సెటిల్‌మెంట్‌కు యత్నించిన జుకర్‌బర్గ్




మెటా సంస్థ అతిపెద్ద యాంటీ ట్రస్ట్ ట్రయల్‌ను ఎదుర్కొంటోంది. మార్కెట్లో గుత్తాధిపత్యం ఆరోపణల నేపథ్యంలో యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్‌ను ప్రశ్నిస్తోంది. అయితే ఈ ట్రయల్‌కు ముందు సెటిల్‌మెంట్ యత్నాలు జరిగాయని అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి.

విచారణకు ముందు జుకర్‌బర్గ్.. ఎఫ్‌టీసీ ఛైర్మన్ ఆండ్రూ ఫెర్గూసన్‌ను సంప్రదించారని ఆ కథనాలు పేర్కొన్నాయి. తొలుత 450 మిలియన్ డాలర్లు ఆఫర్ చేశారని, అయితే విచారణ సమీపిస్తోన్న సమయంలో ఆ మొత్తాన్ని 1 బిలియన్ డాలర్లకు (భారత కరెన్సీలో రూ.8,569 కోట్లు) పెంచారని సమాచారం. అయితే దానిని ఛైర్మన్ తిరస్కరించారు. ఎఫ్‌టీసీ 30 బిలియన్ డాలర్లు ఆశిస్తోందని, 18 బిలియన్ డాలర్ల కంటే తక్కువ ఏ సెటిల్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి సుముఖత వ్యక్తం చేయలేదని పేర్కొన్నాయి. ట్రయల్‌ను తప్పించుకునేందుకు మెటా సీఈఓ ఒక పిచ్చి ప్రయత్నం చేశారని వెల్లడించాయి.

పోటీ లేకుండా చేసేందుకు దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగానే ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ (WhatsApp And Instagram)ను మెటా కొనుగోలు చేసిందని ఎఫ్‌టీసీ ఆరోపించింది. సామాజిక మాధ్యమ రంగంలో ఏకఛత్రాధిపత్యం కోసం ఆ కంపెనీ ప్రయత్నించిందని దుయ్యబట్టింది. ఈసందర్భంగా కొన్ని అంతర్గత మెయిల్స్‌ను కమిషన్ ప్రస్తావించింది. అందులో మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ చేసిన ఈ–మెయిల్ కూడా ఉంది. 'పోటీ పడడం కంటే వాటిని కొనుగోలు చేయడమే ఉత్తమం' అని జుకర్‌బర్గ్ ఆ సందేశంలో పేర్కొన్నారని, దాన్ని బట్టి వారి వ్యూహం ఏంటో అర్థమవుతుందని కమిషన్ వ్యాఖ్యానించింది. ఈ విచారణపై మెటా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తమ కంపెనీ పెట్టుబడులు పెట్టకపోయి ఉంటే.. ఆ యాప్స్‌నకు ఇంత ఆదరణ వచ్చేది

కాదని మెటా న్యాయవాది తమ ఫైలింగ్‌లో పేర్కొన్నారు. ఒకవేళ, కోర్టు ఉత్తర్వులు మెటాకు వ్యతిరేకంగా వస్తే.. కమిషన్ తీసుకునే నిర్ణయం కీలకం కానుంది. ఫలితంగా ఈ టెక్ కంపెనీ ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌ను విక్రయించాల్సి రావొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సెక్రటేరియట్ వద్ద ఇజ్రాయెల్ జాతీయ జెండా తొలగింపు..



తెలంగాణ: సచివాలయం వద్ద మిస్ వరల్డ్ 2025 పోటీల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఇజ్రాయెల్ జెండాను జకీర్ అనే యువకుడు తొలగించాడు. సోషల్ మీడియాలో లైవ్‌స్ట్రీమ్ చేస్తూ జెండాను తొలగించడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం అధికారులు తిరిగి ఇజ్రాయెల్ జెండాను పునఃస్థాపించారు.

తెలంగాణ సెక్రటేరియట్ వద్ద ఇజ్రాయెల్ జాతీయ జెండాను ఓ యువకుడు తొలగించాడు. దీంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. అనంతరం తిరిగి జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. ఇజ్రాయెల్ జెండాకు తెలంగాణ సెక్రటేరియట్‌కు సంబంధం ఏంటని ఆలోచిస్తున్నారా..? హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం మిస్ వరల్డ్ 2025 పోటీలు జరగుతున్న సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో వివిధ దేశాలకు చెందిన అందాల ముద్దుగుమ్మలు పాల్గొంటున్నారు. కంటెస్టెడ్ దేశాలకు చెందిన జాతీయ జెండాలను తెలంగాణ ప్రభుత్వం సెక్రటేరియట్ ఆవరణలో ఏర్పాటు చేసింది.

అయితే, నగరానికి చెందిన జకీర్ అనే యువకుడు ఆ జెండాను ఇటీవల తొలగించాడు. సోషల్ మీడియాలో లైవ్‌స్ట్రీమ్ చేస్తూ.. సెక్రటేరియట్ ముందు ఏర్పాటు చేసిన ఇజ్రాయెల్ జాతీయ జెండాను తొలగించాడు. ఈ చర్య తీవ్ర దుమారం రేపింది. దీనిపై వెంటనే స్పందించిన పోలీసులు.. జకీర్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం వంటి నేరాల కింద అతడిపై కేసులు పెట్టారు. అనంతరం, అధికారులు సచివాలయం వద్ద తిరిగి ఇజ్రాయెల్ జెండాను ఏర్పాటు చేశారు.

హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్ 2024 పోటీల్లో భాగంగా కంటెస్టెంట్లకు ఉత్సాహభరితమైన స్పోర్ట్స్ డే ఈవెంట్‌ను నిర్వహించారు. గచ్చిబౌలి



స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ దేశాల నుంచి వచ్చిన అందాల పోటీదారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం పది రకాల క్రీడాంశాల్లో వీరు తమ అథ్లెటిక్ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, మంత్రి జూపల్లి కృష్ణారావు, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ జూలియా మోర్లీ, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన్ రెడ్డి, సెక్రటరీ మల్లారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం హనుమంత్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. వారి సమక్షంలో కంటెస్టెంట్లు క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు.

స్పోర్ట్స్ డేతో పాటు, మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు తెలంగాణ సంస్కృతిని, వారసత్వాన్ని తెలుసుకునేందుకు పలు ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా, వారు చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన పిల్లలమర్రిని శుక్రవారం సందర్శించారు. మర్రి చెట్టు సహజ సౌందర్యాన్ని, చుట్టుపక్కల ప్రాంతాల ప్రత్యేకతను వారు ఆసక్తిగా తెలుసుకున్నారు. ఇలాంటి సందర్శనలు కంటెస్టెంట్లకు తెలంగాణ రాష్ట్రం గొప్ప సంస్కృతిని పరిచయం చేయడంతో పాటు, వారికి ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. కాగా, మిస్ వరల్డ్ పోటీలు కేవలం అందాల ప్రదర్శనకే పరిమితం కాకుండా, క్రీడా స్ఫూర్తిని, సాంస్కృతిక అవగాహనను పెంపొందించేలా నిర్వహించడం విశేషం. మే 31న హైదరాబాద్‌లో జరగనున్న గ్రాండ్ ఫినాలే కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అమ్మాయి పేరుతో యువకుడితో చాట్..

మంచిర్యాల: గుర్తు తెలియని నెంబర్ నుంచి వాట్సాక్‌కు 'హాయ్' అంటూ మెసేజ్. అది చూసిన సదరు యువకుడు కాస్త ఎగ్జైట్‌గా ఫీల్ అయ్యాడు. డీపీ చూస్తే అందమైన అమ్మాయి ఫోటో ఉంది. అమ్మాయి ఎవరబ్బా.. అని ఆలోచిస్తూనే మెసేజ్‌కు రిప్లయ్ ఇచ్చాడు. ఆ తర్వాత అట్నుంచి యోగక్షేమాలు అడగటం.. కొద్ది రోజుల్లోనే చనువుగా చాట్ చేసుకోవటం మ్మొదలైంది. ఓ రోజు నిన్ను కలవాలనుందంటూ అట్నుంచి మెసేజ్. అది చూసిన మనోడు.. థ్రిల్ ఫీలయ్యాడు. తాను చాట్ చేస్తున్న అమ్మాయిని కలవబోతున్నానని ఆనందంలో తేలిపోయాడు. అయితే అసలు విషయం గుర్తించలేకపోయాడు. తనన ఎవరో ట్రాప్ చేస్తున్నారన్న విషయాన్ని గ్రహించలేక చిత్ర హింసలకు గురయ్యాడు.

మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ అమాయక యువకుడని కొందరు దండగులు దారుణంగా మోసం చేశారు. వాట్సాప్‌లో ఓ అందమైన అమ్మాయి పేరుతో వాట్సాప్ చాట్ చేసి పక్కాగా ట్రాప్ చేశారు. ఈ నెల 11న కరీంనగర్ బస్టాండ్‌కు రప్పించి తెలివిగా కిడ్నాప్ చేశారు. తమను తాము ఆ అమ్మాయి పంపిన మనుషులమని నమ్మబలికారు. వారి మాయమాటలు నమ్మి వారితో వెళ్లిన ఆ యువకుడికి అసలు ప్రమాదం అప్పుడే మొదలైంది.

సందీప్, ప్రణయ్, రెహాన్ అనే ఆ ముగ్గురు దుండగులు అతడిని కరీంనగర్ శివారులోని వెలిచాల గ్రామ సమీపంలోకి బలవంతంగా తీసుకెళ్లారు. అక్కడ అతడిని బంధించ దారుణంగా చిత్రహింసలకు గురి చేశారు. రూ. 50 వేలు ఇస్తేనే వదిలేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. తన ప్రాణాలు కాపాడుకోవడానికి ఆ యువకుడు తన వద్ద ఉన్న రూ. 10 వేలు వారికి ఇచ్చాడు. మరో రూ.12 వేలు ఫోన్ పే ద్వారా పంపించాడు. ఆ దుర్మార్గుల నుండి ఎలాగోలా తప్పించుకున్న ఆ యువకుడు పోలీసులను ఆశ్రయించి జరిగిన ఘోరాన్ని వివరించాడు.

వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వేగంగా స్పందించారు. యువకుడ్ని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురి చేసిన సందీప్, ప్రణయ్‌లను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మూడో నిందితుడు రెహాన్ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్లు, చాటింగ్‌ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వారి మాటలు నమ్మి ట్రాప్‌లో చిక్కితే ఘోరంగా నష్టపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. కాగా, ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అమ్మాయి ఫోటో కనిపించగానే అలా ఎలా వెళ్లాడంటూ కొందరు బాధితుడిని తప్పు బడుతున్నారు.

## ట్రెయిన్ టికెట్‌కు రూ.290.. క్యాబ్‌కు రూ.800..

సికింద్రాబాద్: నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్లైన కాచిగూడ, నాంపల్లి, సికింద్రాబాద్‌లలో ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఉపయోగిస్తున్నప్పటికీ.. అక్కడికి చేరుకోవడానికి, అక్కడి నుంచి తిరిగి ఇంటికి వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో, రైల్వే టికెట్ ధర కంటే ప్రయాణ ఖర్చు ఎక్కువగా ఉంటోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండాపూర్‌కు చెందిన ఒక వ్యక్తి రైలులో ఆదిలాబాద్ చేరుకోవాలంటే.. ఇప్పుడు చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు రావాల్సిందే. సికింద్రాబాద్ నుంచి నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లికి మార్చారు. కొండాపూర్ నుంచి ఆటో లేదా క్యాబ్‌లో చర్లపల్లి టెర్మినల్‌కు చేరుకోవాలంటే.. రూ. 600 నుంచి రూ. 800 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. రాత్రి అయితే, ఇంకా ఎక్కువ డిమాండ్ చేస్తున్నారు. చర్లపల్లి నుంచి ఆదిలాబాద్‌కు స్లీపర్ టికెట్ ఛార్జ్ 290 రూపాయలు మాత్రమే. అంటే, క్యాబ్‌కు మూడింతలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

సికింద్రాబాద్‌కు ఆర్టీసీ బస్సులే కాకుండా ఎంఎంటీఎస్, మెట్రో రైలు సదుపాయం ఉండటంతో నగరం నలుమూలల నుంచి చేరుకోవడానికి మార్గం ఉంది. చర్లపల్లికి రవాణా సదుపాయాలు సరిగా లేకపోవడం, అక్కడికి వెళ్లేందుకు ప్రయాణికులకు సరైన అవగాహన కూడా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌తో ప్రయాణం సులభతరం అవుతుందని భావిస్తే, అధకారుల ప్రణాళిక లోపం కారణంగా ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు.




ప్రధాన స్టేషన్ల నుంచి బయలుదేరే ఈ రైళ్లు ఆయా ప్లాట్‌ఫారంపై 20 నుంచి 30 నిమిషాల వరకు ఉంటాయి. ఆ రైలు కదిలిన తర్వాతే మరో రైలు వస్తుంది. అందుకే కొన్ని రైళ్లను చర్లపల్లికి మార్చారు. వరంగల్, ఏపీ వైపు వెళ్లే రైళ్లకు బదులుగా.. ముంబై, పుణే, బెంగళూరు వైపు వెళ్లే రైళ్లను చర్లపల్లి నుంచి నడిపితే ప్రయోజనం ఉంటుందని ప్రయాణికులు భావిస్తున్నారు. హుస్సేన్ సాగర్, ముంబై ఎక్స్‌ప్రెస్, పుణే శతాబ్ది ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లను చర్లపల్లి నుంచి నడిపితే సికింద్రాబాద్, లింగంపల్లి, బేగంపేట స్టేషన్ల సమీపంలో ఉండేవారు అక్కడే రైలు ఎక్కడానికి, దిగడానికి సులువుగా ఉంటుంది. మధ్యలో సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, కాచిగూడలో 5 నిమిషాలు ఆపితే సరిపోతుందని ప్రయాణికులు భావిస్తున్నారు.

పలు రైళ్లను చర్లపల్లి నుంచి నడపడం వల్ల సమస్యలు వస్తున్నాయని కొందరు ఎంపీలు దక్షిణ మధ్య రైల్వే దృష్టికి తీసుకెళ్లారు. ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసి కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను గతంలో మాదిరి సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా నడిపించాలని కోరారు. సికింద్రాబాద్‌కు వెళ్లకపోవడం వల్ల ఆదిలాబాద్ నుంచి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఇదే తరహా సమస్యలను మరికొందరు ఎంపీలు దక్షిణ మధ్య రైల్వే దృష్టికి తీసుకెళ్లారు.

వాస్తవానికి చర్లపల్లిలో ప్లాట్‌ఫాం 10 వైపు చాలా సౌకర్యాలు కల్పించారు. విశాలమైన పార్కింగ్ స్థలం ఇచ్చారు. బస్సులు ఆగేందుకు విశాలమైన స్థలం ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్‌లో దిగి ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైనుంచి ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు వచ్చే వారు నేరుగా బస్సు టెర్మినల్‌కు చేరుకుంటారు. అయితే, 10వ ప్లాట్‌ఫాం వైపు ఇంత వ్యవస్థ ఉందని చాలా మంది ప్రయాణికులకు తెలియదు. దీంతో రైలు దిగగానే ఎక్కవ మంది ప్లాట్‌ఫాం ఒకటి వైపు వచ్చి అక్కడ ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించి నగరంలోని వివిధ ప్రాంతాలకు చేరుకుంటున్నారు.

1వ నెంబర్ ప్లాట్‌ఫాం వైపు నుంచి బయటకి వచ్చే మార్గంలోనూ బస్సులు ఆగేందుకు టెర్మినల్ ఏర్పాటు చేయాలని, రోడ్లు కూడా వెడల్పు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. పదో నంబర్ ప్లాట్‌ఫాం వైపు ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇవి హోటల్ బ్లూ సీ పాయింట్ నుంచి తార్నాక, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ మీదుగా చర్లపల్లి వెళ్తున్నాయి. ఈ బస్సు వేళలు, రూట్ గురించి చాలా మంది ప్రయాణికులకు అవగాహన లేదు. దీంతో పాటు ప్లాట్‌ఫాం నంబర్ 10 వైపు నుంచి చెంగిచెర్ల మీదుగా ఉప్పల్ రింగ్ రోడ్డుకు ప్రతి అర గంటకు బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. చెంగిచెర్ల నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు నడిపే బస్సులను చెర్లపల్లి వరకు పొడిగించాలని కోరుతున్నారు. తద్వారా ఉప్పల్ రింగ్ రోడ్డుకు కనెక్టివిటీ పెరిగి.. అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్ల ద్వారా నగరంలోని ఏ ప్రాంతానికైనా చేరుకునేందుకు వెసులుబాటు కలుగుతుంది.

## ఎట్టకేలకు ఆ బస్సు సర్వీస్ ప్రారంభం..

హైదరాబాద్: టీజీఎస్ఆర్టీసీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాలకు నడుపుతోంది. దీనిలో భాగంగానే.. మియాపూర్ నుండి బెంగళూరులోని మార్తాహల్లికి లహరి (ఏసీ సీటర్/స్లీపర్) బస్సు సర్వీసు అందుబాటులోకి వచ్చింది. ఈ బస్సు సర్వీసు నేటి నుంచి ప్రారంభం అవుతుందని.. మియాపూర్ ఆర్టీసీ 1వ డిపో మేనేజర్ మోహన్ రావు తెలిపారు.

ఈ బస్సు మియాపూర్‌లో సాయంత్రం 6:40 గంటలకు బయలుదేరి కేపీహెచ్‌బీ, మెహిదీపట్నం, షాద్‌నగర్ మీదుగా వెళ్తుంది. ఈ సర్వీసు బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తుంది. లహరి బస్సులు ప్రయాణికులకు సౌకర్యవంతమైన సీటింగ్, స్లీపింగ్ ఏర్పాట్లను కలిగి ఉంటాయి. ఎయిర్ కండిషనింగ్, వినోద సౌకర్యాలు .. విశాలమైన సీట్లు ఉంటాయి. దూర ప్రయాణాలు చేసే వారికి ఈ బస్సులు చాలా అనుకూలంగా ఉంటాయి. ఇదిలా ఉండగా.. సరస్వతి పుష్కరాల కోసం కూడా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం కాంట్రాక్ట్ పద్ధతిన సూపర్ లగ్జరీ, రాజధాని.. లహరి బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ బస్సులు వివిధ ప్రాంతాల నుండి పుష్కర ఘాట్లకు భక్తులను చేరుస్తాయి. పుష్కరాలకు వెళ్లే భక్తులు ఈ రవాణా సౌకర్యాలను ఉపయోగించుకోవాలని అధికారులు కోరారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు నడుపుతారు. ప్రయాణికుల సౌకర్యం కోసం ఆన్లైన్ టికెట్ బుకింగ్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుంది. బస్సుల వివరాలు .. సమయాల కోసం ఆర్టీసీ వెబ్సైట్ ను సందర్శించవచ్చు లేదా 99592 26153 నంబర్లో సంప్రదించవచ్చు.

జయశంకర్ భూపాల పల్లి జిల్లాలో సరస్వతి




నది పుష్కరాల సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేశాయి. రెండు రాష్ట్రాల నుంచి పుష్కర ఘాట్‌లకు చేరుకోవడానికి బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేశాయి. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పుష్కరాల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతోంది. వివిధ ప్రాంతాల నుండి భక్తులు నేరుగా పుష్కర ఘాట్‌లకు చేరుకునేలా ఈ ఏర్పాట్లు ఉన్నాయి.

## పట్టాలు దాటుతున్న వ్యక్తి.. కళ్లు మూసుకొని తెరిచేలోపే..

రంగారెడ్డి: జిల్లాలో రైలు పట్టాలు దాటుతూ కార్మికుడు ప్రమాదం నుండి తప్పించుకున్న సంఘటన రైల్వే ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుర్తు చేస్తుంది. రైల్వే స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నప్పటికీ, ప్రజలు వాటిని ఉపయోగించకుండా తొందరగా వెళ్లాలనే ఉద్దేశంతో పట్టాలు దాటుతున్నారు. ఇది వారి ప్రాణాలకు హాని కలిగిస్తుంది. రైల్వే అధికారులు, ప్రభుత్వం ప్రజలకు రైలు ప్రయాణంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలి. ప్రయాణికులు కూడా తమ ప్రాణాలను కాపాడుకోవడానికి బాధ్యతగా ప్రవర్తించాలి.

రైల్వే స్టేషన్లలో రైలు కోసం ఎదురుచూసే ప్రయాణికులు పట్టాలకు చాలా దూరంగా నిలబడతారు. రైలు వేగంగా కదులుతున్నప్పుడు గాలికి దగ్గరకు వెళ్లే ప్రమాదం ఉంటుందని వారు భావిస్తారు. స్టేషన్లలోనే ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటుంటే.. రైలు పట్టాలు దాటే సమయంలో ఇంకా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. చెప్పండి. చాలామంది ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నప్పటికీ.. వాటిని ఉపయోగించకుండా రైలు పట్టాల మీద నుంచి దాటుతుంటారు.




గురువారం సాయంత్రం బీహార్‌కు చెందిన ఒక కార్మికుడు ఇలాగే పట్టాలు దాటుతుండగా, గూడ్స్ రైలు కదలడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు. అయితే.. అతను వెంటనే అప్రమత్తమై పట్టాల మధ్యలో పడుకుని ప్రాణాలు కాపాడుకున్నా డు. ఈ సంఘటన అక్కడున్న కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్ అయింది.

ఇది చాలా ప్రమాదకరమైనది. దీనిపై ప్రభుత్వాలు, రైల్వే అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా.. వారు అలానే చేస్తున్నారు. పట్టాలు దాటుతున్న సమయంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఇటీవల మనం చూస్తూ ఉన్నాం. అయినా షరా మాములే అయిపోయింది. తాజాగా.. రంగారెడ్డి జిల్లాలో ఇటువంటి ఘటనే ఒకటి చోటుచేసుంది. ఓ వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా హఠాత్తుగా రైలు రావడంతో పట్టాల మధ్యలో పడుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు.

రంగారెడ్డి జిల్లాలోని తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌లో జరిగిన ఈ సంఘటన రైలు పట్టాలు దాటే ప్రమాదాలను మరోసారి గుర్తు చేసింది. స్టేషన్ ఒకవైపు నివాస గృహాలు, మరోవైపు పరిశ్రమలు ఉండటంతో కార్మికులు తరచుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఉపయోగించకుండా పట్టాలు దాటుతుంటారు. గురువారం సాయంత్రం బీహార్‌కు చెందిన ఒక కార్మికుడు ఇలాగే పట్టాలు దాటుతుండగా, గూడ్స్ రైలు కదలడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు. అయితే.. అతను వెంటనే అప్రమత్తమై పట్టాల మధ్యలో పడుకుని ప్రాణాలు కాపాడుకున్నా డు. ఈ సంఘటన అక్కడున్న కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్ అయింది. రైల్వే స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నప్పటికీ, ప్రజలు వాటిని ఉపయోగించకుండా తొందరగా వెళ్లాలనే ఉద్దేశంతో పట్టాలు దాటుతున్నారు. ఇది వారి ప్రాణాలకు హాని కలిగిస్తుంది.

ప్రయాణికులకు రైలు పట్టాలు దాటేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చు. రైల్వే అధికారులు, ప్రభుత్వం ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పాఠశాలల్లో , కళాశాలల్లో విద్యార్థులకు రైలు ప్రయాణంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి నేర్పించాలి. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించి సురక్షితంగా ప్రయాణించాలి. రైల్వే నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చు.




## మళ్లీ సిబిల్ స్కోర్ రూల్.. 700 దాటితేనే..!

తెలంగాణ: రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక కార్యక్రమం. ఈ పథకం కింద వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు ఇవ్వబడతాయి. అయితే.. రుణాల మంజూరుకు సిబిల్ స్కోరు 700 కంటే ఎక్కువ ఉండాలని అధికారులు పేర్కొనడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. చాలా మంది దరఖాస్తుదారులు రూ. 4 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీని వలన రుణాల పంపిణీ అధికారులకు సవాలుగా మారింది. మొదటిసారి రుణం తీసుకునే వారికి మరియు సంబంధిత వ్యాపారంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో రాయితీ రుణాల కోసం దరఖాస్తులు స్వీకరించింది. వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే ఈ రుణాల మొత్తం రూ. 50,000 నుండి రూ. 4 లక్షల వరకు ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 40,270 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం పత్రాల పరిశీలన.. అర్హుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.

అయితే.. ఈ రుణాల మంజూరుకు సిబిల్ స్కోరు 700 కంటే ఎక్కువ ఉండాలని అధికారులు స్పష్టం చేయడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. బెల్లంపల్లిలోని బ్యాంకర్ల సమావేశంలో, బ్యాంకు ఖాతాల నిర్వహణ .. గతంలో తీసుకున్న రుణాల చెల్లింపుల ఆధారంగానే రుణ గ్రహీతలను ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు .. బ్యాంకు సిబ్బంది పాన్ కార్డు ఆధారంగా దరఖాస్తుదారుల సిబిల్ స్కోరును సేకరించారు.

సిబిల్ స్కోరు ప్రామాణికంగా రుణాలను ఇవ్వడం పట్ల దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇది ప్రతిబంధకంగా మారుతోంది. బ్యాంకుల నుండి వచ్చే సమాచారం ఆధారంగా మండల కమిటీలు అర్హులను ఎంపిక చేస్తాయి. అయితే.. బ్యాంకర్లు మౌఖిక పరీక్షలు నిర్వహించాలని కోరినా ప్రభుత్వం దీనికి సుముఖంగా లేదు.

ఈ పథకం కింద.. చాలా మంది దరఖాస్తుదారులు రూ. 4 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎక్కువ యూనిట్ విలువ ఉంటే రాయితీ ఎక్కువగా వస్తుందనే ఉద్దేశంతో వారు ఇలా చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఈ స్థాయిలో రుణాలు ఎంత మందికి ఇవ్వాలనేది అధికారులకు సవాలుగా మారింది.

వివిధ రకాల వ్యాపారాలకు ఒక్కో యూనిట్ విలువను ప్రభుత్వం ముందుగానే నిర్ణయించింది. దరఖాస్తుదారులు తమకు నచ్చిన వ్యాపారాన్ని ఎంచుకోవచ్చు. రూ. 50,000 వరకు రుణం తీసుకుంటే 100% రాయితీ ఉంటుంది, అంటే తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతర రుణాలపై రాయితీ శాతం ఇలా ఉంటుంది: రూ. 50,001 – రూ. 1,00,000 వరకు 90 శాతం, రూ. 1,00,001 – రూ. 2,00,000 వరకు 80 శాతం, రూ. 2,00,001 – రూ. 4,00,000 వరకు 70 శాతం రాయితీ కల్పిస్తారు. ఇప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తున్నారు. మొత్తం దరఖాస్తుల్లో 80శాతం మంది రూ. 4 లక్షల రుణం కోరడం అధికారులకు పెద్ద సమస్యగా మారింది. మొదటిసారి రుణం తీసుకునే వారికి .. సంబంధిత వ్యాపారంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం కోటాలో దివ్యాంగులకు 5 శాతం.. మహిళలకు 25 శాతం యూనిట్లను కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## 30 ఏళ్ల నిరీక్షణకు తెర..

ఖమ్మం: ఖమ్మం రైల్వే స్టేషన్ పరిసరాల్లో నెలకొన్న రద్దీ సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి చొరవతో స్టేషన్ ఎదుట రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీ రఘురాం రెడ్డి, రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల ప్రయాణికులు , ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. రైల్వే జీఎంతో చర్చించిన అనంతరం రోడ్డు విస్తరణకు ఆమోదం లభించింది. ఎంపీ రఘురాం రెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి, రోడ్డు విస్తరణ తర్వాత దుకాణాలు నిర్వహించే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గత 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతున్నందుకు చిరు వ్యాపారులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.




రైల్వే స్టేషన్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పథకం కింద తెలంగాణలోని అనేక రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పథకం అభివృద్ధి చేసేందుకు తెలంగాణ నుంచి మ్మొదటి విడతలో 21 రైల్వే స్టేషన్లు ఎంపికయ్యాయి. దీనిలో భాగంగానే.. ఖమ్మం రైల్వే స్టేషన్ కూడా అభివృద్ధి బాట పట్టనుంది. గత 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు అన్నీ.. ఈ సారి మొత్త క్లియర్ కానున్నాయి. ప్రస్తుత అవసరాలను దృష్టిలో పెట్టుకుని.. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఎన్నో మౌలిక సదుపాయాలు ఆవిష్కరించబడుతు న్నాయి. రూ. 25.41 కోట్ల వ్యయంతో.. ఈ స్టేషన్‌లో ఏసీతో కూడిన వేచియుండు గదులు, మెరుగైన టాయిలెట్లు, 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ప్రయాణికుల సౌకర్యానికి కొత్త ఆధునిక సదుపాయాలను కలిపేలా పనిచేస్తున్నాయి.

# కడపలో ఇద్దరు అఫ్ఘానిస్థాన్ పౌరులు అరెస్ట్..

**వీసా గడువు ముగిసినా ఇక్కడే గుట్టుగా!**

**కడప:** కడపలో ఇద్దరు అఫ్ఘానిస్థాన్ దేశస్థులు అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు చిక్కారు. ఐదేళ్ల క్రితం వీసాతో వచ్చిన వారి వీసా గడువు ముగిసింది. ఢిల్లీ, నంద్యాల మీదుగా కడపకు చేరిన వీరు ఇక్కడ పనిచేస్తున్నారు. వీసా లేకుండా అక్రమంగా ఉంటున్న వీరిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. వీరి రాక వెనుక అసలు కారణం ఏమిటి? వీరిపై కడప జిల్లా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

కడపలో ఇద్దరు అఫ్ఘానిస్థాన్ దేశస్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున రాజీవ్‌పార్కు దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతుండగా బ్లూకోల్ట్స్ సిబ్బంది వారిని గుర్తించారు. వారిని వెంటనే అదుపులోకి తీసుకుని ఆరా తీయగా.. వారిద్దరు అసదుల్లా, ఓవాస్ అని తేలింది. వెంటనే వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిద్దరూ ఐదేళ్ల క్రితం వీసాతో ఇండియాకు వచ్చారు. ప్రస్తుతం వారి వీసా గడువు ముగిసింది. దీంతో పోలీసులు వారిని ప్రశ్నిస్తున్నారు.

వీరిద్దరు అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చి మొదట ఢిల్లీలో పనిచేశారు.. కొంతకాలం తర్వాత నంద్యాలకు వెళ్లారు. రెండు నెలల క్రితం కడపకు వచ్చారు. వారిలో ఒకరు ఐస్‌క్రీమ్ షాపులో.. మరొకరు వేరే చోట పని చేస్తున్నారు. వారి వీసాల గడువు ముగిసినా అక్రమంగా ఇక్కడ ఉంటున్నారని పోలీసులు చెబుతున్నారు. అందుకే వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. వారి దగ్గర ఉన్న గుర్తింపు కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

మరోవైపు ఇటీవల భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తలతో పాకిస్థాన్ పౌరులు వెంటనే వారి దేశానికి వెళ్లిపోవాలని సూచించిన సంగతి తెలిసిందే. దీంతో భారత్‌లో ఉన్న పాకిస్థాన్ పౌరులు వెంటనే వారి దేశానికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో పోలీసులు ఇటీవల ఏపీలోని పాకిస్థాన్ పౌరుల సమాచారం సేకరించింది.. వారి వీసాలతో పాటుగా ఇతర డాక్యుమెంట్లను పరిశీలించారు. అలాగే పాకిస్థాన్ నుంచి భారత పౌరులు తిరిగి ఇక్కడికి వచ్చేశారు. అయితే తాజాగా కడపలో ఇద్దరు అఫ్ఘానిస్థాన్ పౌరులు దొరికిపోవడం.. వారికి వీసాలు కూడా లేకపోవడం కలకలం రేపుతోంది. వారిద్దరికి వీసాలు లేకపోవడంతో పోలీసులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి. వారికి వీసాలు ఇచ్చి తిరిగి అఫ్ఘానిస్థాన్‌కు పంపిస్తారా.. వారిపై కేసు నమోదు చేస్తారా అన్నది చూడాలి. అసలు వీరు అఫ్ఘానిస్థాన్ నుంచి ఎందుకు వచ్చారు.. ఢిల్లీ నుంచి కడప ఎందుకు రావాల్సి వచ్చిందో ఆరా తీస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారులకు కడప జిల్లా పోలీసులు సమాచారం అందించనున్నారు.

# భారీ వర్షసూచన..



**ఆంధ్రప్రదేశ్:** వాతావరణం గురించి.. ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ కీలక విషయాలు వెల్లడించింది. ఇవాళ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. మరికొన్ని జిల్లాల్లో ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని అంచనా వేసింది. మరికొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వానలు కురవనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రస్తుత వేసవికాలంలో ఎండలు ఎంత దంచుతున్నాయో అదే స్థాయిలో వర్షాలు కూడా కురుస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో అదే పరిస్థితి నెలకొంది. పగలు భానుడి భగభగలతో జనం అల్లాడిపోతూ ఉండగా.. సాయంత్రం, రాత్రి వేళల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో జనం ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లో నేడు(శనివారం) పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీఎస్‌డీఎంఏ) తెలిపింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ రోణంకి కూర్మనాథ్ హెచ్చరించారు.

అదే సమయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, ఏలూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రోణంకి కూర్మనాథ్ తెలిపారు. అలాగే, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లోనూ తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. పిడుగులు పడే, ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. చెట్ల కింద.. పాత గోడలు, భవనాల వద్ద ఉండవద్దని అధికారులు సూచించారు.

వాతావరణ శాఖ కూడా ఏపీలో నేడు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా అల్లూరి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశముందని తెలిపింది. పిడుగులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. విజయనగరం, మన్యం, ఏలూరు, కర్నూలు, నంద్యాల జిల్లాలకు కూడా వర్ష హెచ్చరికలు జారీ చేశారు. తూర్పుగోదావరి, ప్రకాశం, వైఎస్సార్, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. మన్యం-5, అల్లూరి-2, విజయనగరం-2, తూర్పుగోదావరి-1 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అమరావతి తడిసి ముద్దయింది. శాశ్వత సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీల నిర్మాణాల కోసం తీసిన పునాదుల్లో వర్షపు నీరు చేరినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. దీంతో సిబ్బంది భారీ ఇంజన్లు పెట్టి.. పునాదుల్లోని నీటిని బయటికి తోడేస్తున్నట్లు సమాచారం.

# రోజూ అలా చేయకపోతే జీతాలు వేయరా?..

**ఆంధ్రప్రదేశ్:** ప్రభుత్వం ఉపాధ్యాయుల కోసం 'లీప్' అనే కొత్త యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇది టీచర్లు వివిధ పనుల కోసం వాడే యాప్‌ల స్థానంలో ఒకే యాప్‌గా పనిచేస్తుంది. అయితే, ఈ యాప్ ద్వారా హాజరు తప్పనిసరి అని, జీతం కూడా దీని ఆధారంగానే ఇస్తారని తప్పుడు వార్తలు వచ్చాయి. దీనిపై ఏపీ ప్రభుత్వం స్పందించి, అది నిజం కాదని తేల్చి చెప్పింది. ఈ యాప్ గురించి జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధ్యాయుల కోసం ఒక కొత్త యాప్ తీసుకొచ్చింది. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం 'లీప్' (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో ఒక సమగ్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, టాయిలెట్ల నిర్వహణ వంటి వాటి కోసం వేర్వేరు యాప్‌లు వాడేవారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, మన బడి- నాడు నేడు, పీఎంశ్రీ వంటి వివరాలు నమోదు చేయడానికి కూడా వేర్వేరు యాప్‌లు ఉండేవి. చాలా యాప్‌లు ఉండడం వల్ల



వాటి ఐడీలు, పాస్‌వర్డ్‌లు గుర్తుపెట్టుకోవడం టీచర్లకు కష్టంగా ఉండేది. ఇప్పుడు ఉపాధ్యాయులు ముఖ ఆధారిత హాజరు కోసం ఒక ఐడీ, పాస్‌వర్డ్‌తో యాప్‌లో లాగిన్ అవ్వవచ్చు. ఈ యాప్‌లో స్కూల్, టీచర్, స్టూడెంట్, గవర్నెన్స్, కమ్యూనికేషన్, డ్యాష్‌బోర్డు అనే ఆరు విభాగాలు ఉన్నాయి.

ఈ లీప్ యాప్ విషయంలో తప్పుడు ప్రచారం జరుగుతోందని ఏపీ ప్రభుత్వం తెలిపింది. లీప్ యాప్ ద్వారా హాజరు తప్పనిసరి చేసినట్లుగా.. ఆ రిపోర్ట్ ఆధారంగానే జీతం చెల్లిస్తారనే ప్రచారంపై ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్ట్ చెక్ టీమ్ స్పందించింది. 'రాష్ట్ర విద్యాశాఖ 'లీప్ యాప్' ద్వారా హాజరును తప్పనిసరి చేసిందని... హాజరు నివేదిక ఆధారంగా వేతనం లెక్కేస్తారని.. 'లీప్ యాప్'లో హాజరు నమోదు కాకుంటే, ఆ రోజుకు వేతనం కట్ చేస్తారని.. ఒక దినపత్రికలో వచ్చిన వార్త అబద్ధం. అలాంటి యాప్ ఏదీ లేదు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయ సిబ్బంది కానీ, ఉపాధ్యాయులు కానీ, ప్రజలు కానీ ఇటువంటి ఫేక్ వార్తలను నమ్మవద్దు' అంటూ ట్వీట్ చేశారు.

'రాష్ట్ర విద్యాశాఖ లీప్ యాప్‌లో హాజరును తప్పనిసరి చేసింది. ప్రతిరోజూ నిర్దేశించిన సమయాల్లో ఈ యాప్ ద్వారా హాజరు వేయాలని సూచించింది. ఈ లీప్ యాప్ హాజరు నివేదిక ఆధారంగానే నెల జీతాన్ని కచ్చితంగా లెక్కించనున్నారు. యాప్‌లో హాజరు నమోదుకాకుంటే ఆ రోజు సెలవుగా పరిగణించి జీతంలో కోత విధిస్తారు. ఈ విధానాన్ని పాఠశాల విద్యాశాఖ కార్యాలయ సిబ్బందికి పరిమితి చేయడగగా.. త్వరలో ఉపాధ్యాయులకు కూడా వర్తింపజేయనున్నట్లు సమాచారం' అంటూ ప్రచారం జరుగుతోందన్నారు. ఏపీ ప్రభుత్వం ఈ లీప్ యాప్ అటెండెన్స్ విషయంలో క్లారిటీ ఇవ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ యాప్ విషయంలో ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.. అటెండెన్స్, జీతానికి సంబంధించి ఏపీ ఫ్యాక్ట్ చెక్ టీమ్ స్పందించింది.. ఆ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని సూచించింది. ఏపీ ఫ్యాక్ట్ చెక్ టీమ్ రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై తప్పుడు ప్రచారం జరిగితే సోషల్ మీడియా వేదికగా క్లారిటీ తీస్తోంది.

# ఆ ప్రాంతంలో ట్రెక్కింగ్‌కు వెళ్తున్నారా..



**ఆంధ్రప్రదేశ్:** శేషాచలం అడవుల్లోకి అక్రమంగా ప్రవేశించే వారి భరతం పట్టేందుకు అటవీ శాఖ సమాయత్తమైంది. కొండలు, గుట్టలు దాటి సాహస యాత్రలకు వెళ్లే ముఠాలపై నిఘా పెట్టింది. నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం ఖబడ్దార్! తలకోన, అన్నమయ్య జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో రహస్యంగా ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న వారి గుట్టు రట్టు చేసేందుకు ప్రత్యేక కమిషన్ రంగంలోకి దిగింది. సోషల్ మీడియా వేదికగా వన్యప్రాణులను ప్రదర్శిస్తే అంతే సంగతులు!

ఏపీలోని ఉమ్మడి చిత్తూరుతో పాటూ ఉమ్మడి కడప జిల్లాలోకి శేషాచలం అడవి విస్తరించి ఉంది. శేషాచలం అడవుల్లోకి అక్రమంగా ప్రవేశాన్ని అడ్డుకోవడానికి అటవీ శాఖ సిద్ధమైంది. అటవీ చట్టాలను అతిక్రమించిన వారిపై కొరడా ఝుళిపించడానికి సిద్ధమైంది. ఇటీవల కాలంలో ఘటనలతో శేషాచలం అడవుల్లోకి అక్రమంగా ప్రవేశించే వారిని అడ్డుకోవడానికి అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అటవీ చట్టాలను ఉల్లంఘించి అడవుల్లోకి ప్రవేశించే వారిపై నిషేధం విధించింది. గత కొన్నేళ్లుగా చట్టవిరుద్ధంగా ట్రెక్కింగ్ సంస్థలు నిర్వహిస్తూ, అడవుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటోంది. అనధికారికంగా ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న వారిపై విచారణ జరిపి, వారిపై కేసులు నమోదు చేయడానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది.

శేషాచలం అటవీ ప్రాంతంలో అక్రమంగా ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న సంస్థలను గుర్తించి, వారిపై విచారణకు ఆదేశించింది. తలకోన, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఇటీవల జరిగిన అనధికార ట్రెక్కింగ్‌లకు కారణమైన సంస్థల నిర్వాహకులపై, సహకరించిన అటవీ శాఖ అధికారులపై విచారణ జరిపి కేసులు నమోదు చేయడానికి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేశారు. భాకరాపేట రేంజ్ పరిధిలోని తలకోన, అన్నమయ్య డివిజన్‌లో అక్రమంగా ట్రెక్కింగ్ నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేశారు. తలకోన పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు మెమోలు జారీ చేశారు. సోషల్ మీడియా ద్వారా ట్రెక్కర్లను ఆకర్షిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న ట్రెక్కింగ్ సంస్థలపై చర్యలు తీసుకోవడానికి అటవీ శాఖ సిద్ధమవుతోంది. తిరుపతి సీఎఫ్ సెల్వం ఆదేశాల మేరకు ప్రత్యేక విచారణ కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్‌లో తిరుపతి సబ్ డీఎఫ్‌వో, తిరుపతి, భాకరాపేట, పనపాకం, సత్యవేడు, పుత్తూరు రేంజర్లు విచారణ అధికారులుగా ఉంటారు. గూగుల్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ద్వారా ట్రెక్కర్లతో కలిసి శేషాచలం అడవుల్లో అనధికారికంగా ట్రెక్కింగ్‌లు నిర్వహిస్తున్న సంస్థలను అటవీ శాఖ గుర్తించింది. అనుమతులు లేకుండా అడవుల్లో తిరుగుతూ.. షెడ్యూల్-1 కిందకు వచ్చే వన్యప్రాణులను ఫోటోలు తీస్తూ, వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిని కూడా గుర్తించారు. ఈ క్రమంలో 8 ట్రెక్కింగ్ సంస్థలను గుర్తించారని చెబుతున్నారు.

అటవీ శాఖ అనుమతులు లేకుండా శేషాచలం అడవుల్లోకి ప్రవేశించి, వన్యప్రాణి రక్షణ చట్టం 1972 ప్రకారం షెడ్యూల్-1 కిందకు వచ్చే, %×.ఖ.జ.చీ% జాబితా ప్రకారం అంతరించిపోతున్న జంతువుగా గుర్తింపు పొందిన స్లెండర్ లోరీస్ (దేవాంగపిల్లి)ని ఫోటోలు తీసిన వ్యక్తిపై కూడా చర్యలు తీసుకోనున్నారు. ఈ సంస్థలపై, నిర్వాహకులపై విచారణ జరిపి, కేసులు నమోదు చేయడానికి విచారణ కమిషన్ పనిచేస్తుంది. అటవీ శాఖ అధికారులు అడవుల సంరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అటవీ చట్టాలను అతిక్రమించి అడవుల్లోకి ప్రవేశించేవారిని నియంత్రించేందుకు నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు.

# ఆఫీస్ బాయ్‌ని చెప్పుతో కొట్టిన ఎక్సైజ్ సీఐ..



**అనంతపురం:** జిల్లాలోని కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ హసీనాభాను ఒక వివాదంలో చిక్కుకున్నారు. ఆమె తన ఆఫీస్ అటెండర్‌ను చెప్పుతో కొట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం అక్రమంగా విక్రయించే వారి నుండి డబ్బులు వసూలు చేస్తున్నావని, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నావని సీఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. దీనిపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ వివాదంలో చిక్కుకున్నారు.. ఆమె ఆఫీస్ బాయ్‌పై చెప్పుతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. 'మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వారి నుంచి నీవు డబ్బులు వసూలు చేసుకొని నాపై చెబుతావా.. నా మీద లేనిపోని ఆరోపణలు చేస్తావా' కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ హసీనాభాను ఆఫీస్ బాయ్‌ని చెప్పుతో కొట్టారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటన బయటపడింది. కొంతకాలంగా తన పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని హసీనాభాను చెబుతున్నారు.. ఈ క్రమంలో అటెండర్‌తో సీఐకి వాగ్వాదం జరిగింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి సీఐ అటెండర్‌ను చెప్పుతో కొట్టారు. అయితే అటెండర్ మాత్రం తనకు ఏం తెలియదు అంటున్నారు.

ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో ప్రతి నెలా మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వారి నుంచి సీఐ డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయట. ఇదే విషయంపై ఆఫీస్ బాయ్ నాని ఎక్సైజ్ ఉద్యోగుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదు అంశంపై ఆ శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ఆమెతో మాట్లాడేందుకు వచ్చారు. అదే సమయంలో ఆఫీస్ బాయ్‌ని సీఐ హసినాభాను పిలిపించి దురుసుగా ప్రవర్తించారు. అందరి ముందు చెప్పుతో కొట్టారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఏకంగా ఎక్సైజ్ స్టేషన్‌లోనే ఆఫీస్‌బాయ్‌పై దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

# ఆ అసెంబ్లీ నియోజకవర్గం పక్క జిల్లాలో కలవబోతోంది..

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన తర్వాత కూడా మార్పులు తప్పేలా లేవు. తాజాగా ఒక మాజీ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాన్ని మరో జిల్లాలో కలపాలని ప్రతిపాదనలు వస్తున్నాయి. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలపడానికి అధికారులు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ప్రజల సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకుంటున్నారట. దీనిపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇంతకీ ఆ నియోజకవర్గం ఏంటి? ఎందుకు ఈ మార్పు?

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం హయాంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. 13 ఉమ్మడి జిల్లాలను 26 జిల్లాలుగా పునర్విభజన చేశారు. అయితే ఇప్పటికీ కొన్ని జిల్లాల్లోని మండలాలు, రెవెన్యూ డివిజన్ల మార్పు అంశంపై ప్రభుత్వానికి వినతులు వస్తున్నాయి. అలాగే ఒకటి, రెండు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ కూడా వినిపించింది. అయితే తాజాగా ప్రభుత్వం దగ్గరకు ఒక సరికొత్త ప్రతిపాదన వచ్చినట్లు తెలుస్తోంది. ఓ మాజీ మంత్రి నియోజకవర్గాన్ని మరో జిల్లాలో కలపాలనే ఆలోచన జరుగుతోంది అంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వం దగ్గరకు ప్రతిపాదనలు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరు నియోజకవర్గాన్ని తీసుకెళ్లి అన్నమయ్య జిల్లాలో కలపాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రజలకు సౌకర్యంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తున్నారని.. 2022లో జిల్లాల విభజన సమయంలోనే ఇది జరగాల్సి ఉన్నా.. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒత్తిడితో అది జరగలేదనే వాదన వినిపిస్తోంది. ఈ క్రమంలో ఇప్పుడు మళ్లీ పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలపాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ మేరకు పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలపడానికి అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ప్రజల సౌలభ్యం కోసమే ఈ మార్పు చేస్తున్నారని.. దీనిపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని సమాచారం. వాస్తవానికి పార్లమెంట్ నియోజకవర్గాల ప్రకారం జిల్లాలను ఏర్పాటు చేశారు.. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలోని పుంగనూరును చిత్తూరులో కలపడంపై మాత్రం అభ్యంతరం వ్యక్తమైంది. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు దగ్గరగా పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, రొంపిచెర్ల మండలాలు ఉన్నాయి. వీటిని పలమనేరు డివిజన్‌లో చేర్చారు. రెవెన్యూ డివిజన్ కేంద్రానికి వెళ్లడానికి ప్రజలకు ఇబ్బందిగా ఉందని ప్రభుత్వం గుర్తించింది. అందుకే అన్నమయ్య జిల్లాలో కలిపేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నియోజకవర్గంలోని పులిచెర్ల మండలం మాత్రం చిత్తూరు జిల్లాలోనే ఉంటుంది.. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఇప్పటికే 11 మండలాలు ఉన్నాయి. కొత్తగా మరో ఐదు మండలాలు చేరే అవకాశం ఉంది. ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మార్పును ఉన్నతాధికారులు ప్రతిపాదించినట్లు చెబుతున్నారు. దీనిపై పూర్తిగా క్లారిటీ రావాల్సి ఉంది.

# అన్నదాత సుఖీభవ పథకం.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి?



రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు, తద్వారా వారికి ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రారంభించింది. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. ఒక్కో రైతుకు ఏటా రూ. 20 వేలు అందించనున్నారు. మొత్తం 3 విడతలుగా ఈ మొత్తాన్ని రైతు ఖాతాలో జమ చేస్తారు. కేంద్రం పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ. 6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి మొత్తం రూ. 20,000 ఆర్థికసాయం అందిస్తారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర పూర్తి వివరాలు..

రైతు తనకు ఎన్ని నష్టాలు వచ్చినా.. వ్యవసాయం చేయడాన్ని మాత్రం మానడు. దేశానికి అన్నం పెట్టేందుకు తన చెమటను ధారపోస్తాడు. అలాంటి అన్నదాతలకు.. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, ఎరువుల ధరలు మరింత గుదిబండగా మారుతున్నాయి. అలాంటి రైతన్నలకు పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం 'అన్నదాత సుఖీభవ' (%ూాఅఖుఞ్ఖు ూబఎష్త్రఅఎష్టుఖు ూఎష్త్రవఎవ%). గత ప్రభుత్వ (వైఎస్సార్‌సీపీ) హయాంలో 'వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో అమలు చేసిన ఈ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 వారి ఖాతాల్లో జమ చేయగా.. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ. 20,000లకు పెంచింది. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీడీపీంబీజేపీంజనసేన కూటమి.. రైతులకు ఏటా 20 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. అనంతరం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది.

అన్నదాత సుఖీభవ పథకం అనేది ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న %ూవీ-ఖ×ూూచీ% పథకానికి అనుబంధంగా దీన్ని రూపొందించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం అందించే రూ. 6,000లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 14000 కలిపి మొత్తం రూ. 20,000లను నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. మూడు దఫాల్లో ఈ మొత్తాన్ని అందజేస్తారు.

**అన్నదాత సుఖీభవ పథకానికి ఎవరు అర్హులు?**

1ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రైతులు మాత్రమే అర్హులు. చిన్న, సన్నకారు రైతులు (5 ఎకరాల లోపు భూమి కలిగినవారు) మాత్రమే అర్హులు.

1వయస్సు 18 సంవత్సరాలు నిండి ఉండాలి.

1భూమికి సంబంధించి పక్కా పత్రాలు, పట్టా లేదా పాస్‌బుక్ తప్పనిసరిగా ఉండాలి.

1రైతు పేరు ఆధార్‌తో అనుసంధానమై ఉండాలి.

1రైతు పండించే పంటల వివరాలను నమోదు చేయాలి. భూమిని లీజుకు తీసుకున్న కౌలు రైతులు కూడా ఈ పథకానికి అర్హులు. అయితే, తప్పనిసరిగా కౌలు రైతు ధ్రువీకరణ పత్రం ఉండాలి.

1సాధారణంగా పీఎం-కిసాన్ పథకానికి అర్హులైన రైతులందరూ, అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు.

# ఉచిత బస్సు డేట్ ఫిక్స్

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకంపై కూటమి ప్రభుత్వం కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఇప్పటివరకు అప్పుడు, ఇప్పుడు అంటూ ఆలస్యం అవుతుండగా.. తాజాగా స్వయంగా సీఎం చంద్రబాబు ప్రకటన వెలువరించారు. తాజాగా కర్నూలులో పర్యటించిన ముఖ్యమంత్రి.. ఆగస్ట్ 15వ తేదీ నుంచి.. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏపీలోని మహిళలందరికీ టీడీపీ-జనసేన-బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభించే తేదీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలువరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణ సదుయం కల్పిస్తామని తాజాగా సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేయగా.. అందులో పాల్గొన్న ముఖ్యమంత్రి.. ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రజలతో ప్రమాణం చేయించారు.

మహిళలకు అండగా ఉండేందుకు ఈ పథకాన్ని తీసుకువస్తున్నట్లు ఇప్పటికే కూటమి నేతలు పదే పదే చెబుతూ వస్తున్నారు. మహిళలకు రవాణా ఖర్చులు తగ్గించడం, వారికి ఆర్థిక



స్వాతంత్ర్యం కల్పించి.. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే ఉద్దేశంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయాలని ఏపీ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వస్తే రోజుకు సుమారు 25 లక్షల మంది మహిళలు.. ఈ పథకం కింద ప్రయోజనం పొందుతారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఒక్కొక్కటిగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను కూడా వచ్చే నెలలోనే ప్రారంభించనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. జూన్ 12వ తేదీన అన్నదాత సుఖీభవ.. తల్లికి వందనం పథకం ప్రారంభించాలని ఇటీవల జరిగిన టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించినట్లు.. భేటీ తర్వాత మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు.

ఉత్తేజిత దినపత్రిక





# తట్టుకోలేక ఏడ్చేశా..

సినీ ఇండస్ట్రీ అంటేనే గ్లామర్ ప్రపంచం. కళ్లుచెదిరే మేకప్పులు, ధగధగలాగే కాస్ట్యూమ్స్ ఇలా ఎక్కడ కనిపించినా హీరోయిన్లు తళతళ మెరిపిసోతుంటారు. హాట్ హాట్ ఫోజులతో ఫోటోషూట్లు చేస్తూ సోషల్‌మీడియాలో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తుంటారు. అయితే లేడీ పవర్‌స్టార్‌గా ముద్రపడిన సాయిపల్లవి తీరు ఇందుకు భిన్నంగా ఉంటుంది. బయటే కాదు సినిమాలోనూ మేకప్ అన్నదే వేసుకోదు. మొహం మీద మొటిమలతో మామూలు వస్త్రధారణతో ఒక సాధారణ మహిళ ఎలా ఉంటుందో అలాగే కనిపిస్తుంది సాయిపల్లవి. ఆ వ్యవహారశైలే ఆమెను అందరికీ మరింత దగ్గర చేసింది. ఫిదా, పడిపడి లేచె మనసు, శ్యామ్ సింగరాయ్, ఎంసీఏ, లవ్‌స్టోరీ ఇలా విభిన్న కథా చిత్రాలతో తెలుగువారికి మరింత దగ్గరైంది. తాజాగా వచ్చిన 'తండేల్'తో బ్లాక్‌బస్టర్ హిట్టు కొట్టిన సాయిపల్లవి ప్రస్తుతం హిందీలో 'రామాయణ' మూవీలో సీతగా నటిస్తోంది. కొన్నాళ్లక్రితం ఓ టీవీ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'శ్యామ్ సింగరాయ్' మూవీలో తనకు ఎదురైన అనుభవాల గురించి చెప్పుకొచ్చింది సాయిపల్లవి. 'శ్యామ్ సింగరాయ్'లో నేను ఉండే సన్నివేశాలన్నీ చాలావరకు రాత్రిపూటే షూట్ చేసేవాళ్లు. అప్పటివరకు నాకు నైట్ షూట్‌లు అలవాటు లేదు. దీంతో ఏరోజుకారోజు షూట్ పూర్తికాగానే ఎంతో ఆనందపడేదాన్ని. నాకు పగలు నిద్రవచ్చేది కాదు. అందువల్ల రాత్రిళ్లు నా పరిస్థితి దారుణంగా ఉండేది. తెల్లవారుజాము వరకు మేల్కొని ఉండాల్సి రావడం నావల్ల అయ్యేది కాదు. ఒకటి కాదు రెండు ఏకంగా 30 రోజులు నా పరిస్థితి అలాగే ఉండేది. 'శ్యామ్ సింగరాయ్' చేస్తూనే.. పగలు అప్పటికే నేను సైన్ చేసిన సినిమాల షూటింగ్‌కి వెళ్లాల్సి వచ్చేది. దీంతో క్షణం తీరిక లేక, నిద్రలేక మానసిక ఒత్తిడికి గురయ్యేదాన్ని.



# పవర్‌ఫుల్ రోల్‌లో చందమామ

ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ బాలీవుడ్‌లో భారీ ప్రాజెక్ట్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నారు. దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న రామాయణ చిత్రంలో కాజల్‌కి కీలక పాత్ర దక్కినట్లు సమాచారం. ఈ సినిమాలో ఆమె రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. రావణుడిగా యాష్ ఎంపిక అయ్యాడు. ఇప్పుడు మండోదరి పాత్ర కోసం కాజల్ ఎంట్రీతో సినిమాపై హైప్ క్రియేట్ అయింది.

'యానిమల్' మూవీతో బ్లాక్‌బస్టర్ హిట్టు కొట్టిన రాకింగ్ స్టార్ రణ్‌బీర్ కపూర్, లేడీ పవర్ స్టార్ సాయిపల్లవి జంటగా నితీశ్ తివారీ డైరెక్షన్లో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఇందులో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా నటిస్తుండగా.. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్న యష్ రావణుడిగా కనిపించనున్నాడు. ఇక హనుమంతుడిగా సన్నీడియోల్, ఇంద్రుడిగా కునాల్ కపూర్, దశరథుడిగా అరుణ్ గోవిల్, ఇంద్రుడిగా కునాల్ కపూర్ నటిస్తున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టుడియోస్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై నమిత్ మల్హోత్రా,, యాష్ సంయుక్తంగా దీన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా రూ.835 కోట్లు వెచ్చిస్తున్నట్లు బాలీవుడ్ టాక్. ఈ సినిమాకి సంబంధించి షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ మూవీకి షూటింగ్ ఫోటోలు కొంతకాలం క్రితం లీక్ కావడంతో మేకర్స్ అప్రమత్తమయ్యారు. ఇకపై ఎలాంటి లీకులు బయటకు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్ పార్ట్ 026 దీపావళికి విడుదల కావచ్చని అంచనా.

ఇక ఈ సినిమాకు సంబంధించి అనేక వార్తలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా నటీనటుల ఎంపికపై రూమర్స్ గట్టిగానే వస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం ప్రకారం ఈ మూవీలో కాజల్ అగర్వాల్ నటించనుంది. రామాయణ ఇతిహాసంతో రావణుడి సతీమణి అయిన మండోదరికి ఎంత ప్రాధాన్యత ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు బాలీవుడ్ రామాయణలో ఆ పాత్ర కోసం కాజల్‌ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇందులో రావణుడిగా యష్ నటిస్తుండగా.. ఆయనకు జోడీగా కాజల్‌ని ఎంపిక చేసినట్లు వార్తలొస్తున్నాయి. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక సమాచారం రావాల్సి ఉంది. తెలుగులో ఎన్నో చిత్రాల్లో నటించి మెప్పించిన కాజల్ అగర్వాల్‌కి బాలీవుడ్ కొత్తేమీ కాదు. సింగం, స్పెషల్ 26 వంటి హిందీ చిత్రాల్లో కాజల్ నటించి మెప్పించింది. ఇప్పుడు 'రామాయణ' లాంటి భారీ బడ్జెట్ చిత్రంలో ఛాన్స్ వచ్చినట్లు తెలుస్తుండటంతో ఆమె ఎలా కనిపిస్తుందోనని అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

రామాయణంలో మండోదరి పాత్రకు విశేషమైన ప్రాధాన్యత ఉన్న సంగతి తెలిసిందే. విశ్వకర్మ పుత్రుడైన మయబ్రహ్మ, దేవకన్య అయిన హేమకు కలిగిన సంతానం. రావణుడిని పెళ్లాడిన తర్వాత ఈమెకు ఇంద్రజిత్తు అనే కుమారుడు పుడతాడు. లంకా నగరానికి రాజైన రావణుడు చేసే అకృత్యాలను ఖండిస్తూ భర్తకు మంచి సలహాలు ఇచ్చే పాత్ర ఆమెది. సీతను ఎత్తుకొచ్చినప్పుడు తప్పని వారించి ఆమెను రాముడికి అప్పగించాలని సూచిస్తుంది. కథా ప్రాధాన్యమున్న ఇలాంటి పాత్రకు సీనియర్ మరియు పాపులర్ నటి అయితే బాగుంటుందని భావించే మేకర్స్ కాజల్‌ని సెలక్ట్ చేసినట్లు సమాచారం.

# కూతురు పెళ్లికి సీఎంని రావొద్దన్న కృష్ణ..



సూపర్‌స్టార్ కృష్ణ రీల్ లైఫ్‌లోనే కాదు రియల్ లైఫ్‌లోనూ డేరింగ్‌గా ఉండేవారు. ఆయన పెద్దకుమార్తె పద్మావతి వివాహం 1991లో గల్లా జయదేవ్‌తో చెన్నైలో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఆహ్వానించిన తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, భారీ సెక్యూరిటీ కారణంగా అతిథుల్లో కొంతమందిని వెనక్కి పంపించాలంటూ అభ్యర్థించగా, కృష్ణ ఆమెను పెళ్లికి రావొద్దని చెప్పేశారు. ఈ విషయాన్ని జయలలిత పెద్ద మనసుతో అంగీకరించి బొకే పంపించారు. ఇది అప్పట్లో తెగ చర్చకు దారి తీసింది. తెలుగు సినీ ఇండస్ట్రీలో సూపర్‌స్టార్ కృష్ణ అంటే సాహసానికి మరోపేరు. నటుడిగానే కాదు, నిర్మాత, దర్శకుడిగానూ సత్తా చాటారాయన. కృష్ణకి 1962లో మేనమామ కూతురు ఇందిరాదేవితో వివాహమైంది. ఇందిరతో వివాహమైన నాలుగేళ్లకు 1969లో విజయనిర్మలతో కృష్ణకు రెండో వివాహమైంది. దాదాపు 48 సినిమాల్లో విజయనిర్మలతో కలిసి ఆయన నటించారు. మొత్తం 16 సినిమాలకు దర్శకత్వం వహించిన కృష్ణ.. 1974లో ఉత్తమ నటుడిగా నంది పురస్కారం సొంతం చేసుకోగా.. 1976లో కేంద్ర కార్మికశాఖ నటశేఖర్ అనే బిరుదుతో ఆయనను సత్కరించింది. 1997లో ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం కృష్ణకు దక్కింది. సినిమాల్లోనే కాదు నిజజీవితంలోనూ కృష్ణ డేరింగ్‌గానే ఉండేవారు. ఎంతలా అంటే తన కూతురు పెళ్లికి రాష్ట్ర ముఖ్యమంత్రినే రావొద్దని చెప్పేటంత. కృష్ణ పెద్దకుమార్తె పద్మావతి వివాహం 1991, జూన్ నెలలో చెన్నైలో గల్లా జయదేవ్‌తో అట్టహాసంగా జరిగింది. పారిశ్రామికవేత్త అయిన గల్లా రామచంద్రరావు, అరుణకుమారి దంపతుల ఏకైక కుమారుడు జయదేవ్ అమరరాజా బ్యాటరీస్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా తన వ్యాపారాన్ని విస్తరించారు. తెలుగుదేశం పార్టీ నుంచి గుంటూరు ఎంపీగా రెండు పర్యాయాలు సేవలందించిన ఆయన మొన్నటి ఎన్నికల్లో తప్పుకోవడంతో పాటు రాజకీయాలకు దూరమయ్యారు. పద్మావతి, జయదేవ్ పెళ్లిని చెన్నైలో అట్టహాసంగా జరిపించారు కృష్ణ. సినీ, రాజకీయ రంగాలకు చెందిన చాలామంది ఈ పెళ్లికి హాజరయ్యారు. అప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలితను సైతం ఆయన ఆహ్వానించారు. అయితే భారీ సెక్యూరిటీతో ఉండే జయలలిత ఈ పెళ్లికి రావాలంటే అతిథుల కోసం వేసిన రెండు వరుసలు ఖాళీ చేయడంతో పాటు చాలామందిని వెనక్కి పంపించేయాలని చెప్పారట. అప్పటికే, మంత్రులు, పెద్ద పెద్ద రాజకీయ నాయకులూ, వ్యాపారవేత్తలు అక్కడ ఆసీనులై ఉన్నారు. పెళ్లికి వచ్చిన అతిథులను లేవమని చెప్పడానికి మనస్సు అంగీకరించని కృష్ణ.. ఆమెనే పెళ్లికి రావొద్దని చెప్పేశారట. ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రినే తన పెళ్లికి రావొద్దని కృష్ణ చెప్పడం అక్కడ అందరినీ షాక్‌కి గురిచేసింది. యలలిత నుంచి ఎలాంటి స్పందన వస్తుందోనని టెన్షన్ పడిపోయారట. అయితే కృష్ణ ఇబ్బం దిని అర్థం చేసుకున్న జయలలిత ఈ విషయాన్ని చాలా స్పోర్టివ్‌గా తీసుకుని వధూవరులకు బొకే పంపించారట. అలా పద్మావతి, జయదే వ్‌ల వివాహం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది.

# రవికి జోడీగా మలయాళ బ్యూటీ?





తెలుగు, తమిళ భాషల్లో పలు సూపర్‌హిట్ సినిమాలు చేసిన ఏఎం రత్నం '7/జి బృందావన్ కాలనీ' సీక్వెల్ కోసం సన్నాహాలు మొదలుపెట్టారు. సెల్వరాఘవన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్టులో హీరోగా రవికృష్ణనే కొనసాగిస్తున్నారు. అయితే హీరోయిన్ ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతున్న వేళ, మలయాళ నటి అనస్వర రాజన్ ఫైనల్ అయినట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్. 'రేఖాచిత్రం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన అనస్వరకు ఇది భారీ అవకాశం కానుంది. అధికారిక ప్రకటన తేలాల్సి ఉన్నా, ఈ వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది. సీక్వెల్‌పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

తెలుగు, తమిళ భాషల్లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు నిర్మించారు ఏఎం రత్నం. పెద్దరికం, కర్తవ్యం, భారతీయుడు, ఒకేఒక్కడు, ప్రేమికుల రోజు, ఖుషీ, 7/జి బృందావన్ కాలనీ, బంగారం.. వంటి సూపర్‌హిట్ చిత్రాలు నిర్మించారాయన. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా 'హరిహర వీరమల్లు' నిర్మిస్తున్నారు. ఈ మూవీ జూన్ 12న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. నిర్మాతగా ఎందరికో సినీ జీవితాన్ని ఇచ్చిన ఏఎంరత్నం తన కుమారు రవికృష్ణని మాత్రం హీరోగా నిలబెట్టలేకపోయారు. ఆయన కెరీర్లో చెప్పుకోదగ్గ సినిమా ఏదైనా ఉందంటే అది బృందావన్ కాలనీ'. సెల్వ రాఘవన్ దర్శకత్వంలో 2004లో రిలీజైన ఈ సినిమా అప్పట్లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. తొలి చిత్రమే అయినప్పటికీ రవికృష్ణ యాక్టింగ్, సోనియా అగర్వాల్ అందచందాలు, యువన్ శంకర్‌రాజా స్వరపరిచిన గీతాలు ఈ సినిమాని బ్లాక్‌బస్టర్‌గా నిలబెట్టాయి.

రెండు దశాబ్దాల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్ తీసే పనిలో పడ్డారు మేకర్స్. మొదటి చిత్రానికి దర్శకత్వం వహించిన సెల్వ రాఘవన్ డైరెక్షన్లోనే ఏఎం రత్నం దీన్ని తీస్తున్నారు. అయితే ఈ మూవీలో హీరోయిన్ ఎవరన్న దానిపై కొంతకాలంగా సస్పెన్స్ కొనసాగుతోంది. 'లవ్‌టుడే' ఫేమ్ ఇవానా నటిస్తోందని కొంతకాలంగా వార్తలొచ్చినా అధికారిక ప్రకటన రాలేదు. అలాగే డైరెక్టర్ శంకర్ కుమార్తె అదితి శంకర్ పేరు ప్రచారం జరిగింది. ఇంకా చాలామంది పేర్లు వినిపిస్తుండగా.. ఎవరూ ఊహించని మరో పేరు తెరపైకి వచ్చింది. అదే అనస్వర రాజన్. ఈ పేరు తెలుగు ప్రేక్షకులకు పెద్దగా తెలియకపోయినా మలయాళం, హిందీ ప్రేక్షకులకు పరిచయమే. అయితే ఈ ఏడాది వచ్చిన 'రేఖాచిత్రం' అనే డబ్బింగ్ చిత్రంలో అనస్వర రాజన్ మనకూ పరిచయం అయిపోయింది.

'రేఖాచిత్రం'లో ఆమె అమాయకపు నటన, అందచందాలు ప్రేక్షకులను మెస్మరైజ్ చేశాయి. సూపర్‌హిట్‌గా నిలిచిన ఆ మూవీతో అనస్వరకు ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే 7/జి బృందావన్ కాలనీ సీక్వెల్‌లోనూ ఆమెను ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై నిర్మాతలు ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ అనస్వర హీరోయిన్‌గా దాదాపుగా ఫిక్స్ అయిపోయినట్లు కోలీవుడ్ టాక్. అదే నిజమైతే ఆమె పంట పండినట్లే. 2017లో వచ్చిన 'ఉదాహరణం సుజాత' మూవీతో మలయాళ చిత్రసీమలోకి అడుగుపెట్టిన అనస్వర ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించి మెప్పించింది. 2023లో మోహన్‌లాల్, ప్రియమణి కాంబోలో వచ్చిన 'నేరు' అనే కోర్టు డ్రామా ఆమెకు మంచి పేరు తీసుకొచ్చింది. అంధురాలిగా ఉంటూ బలాత్కారానికి గురైన బాధితురాలిగా ఆమె నటన ప్రశంసలు అందుకుంది. ఇక ఈ ఏడాది జనవరిలో వచ్చిన 'రేఖాచిత్రం'తో అనస్వర ఫేటే మారిపోయింది. హీరోయిన్ కావాలన్న కోరికతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన యువతి జీవితం అర్థంతరంగా ఎలా ముగిసిపోయింది అనే స్టోరీలైన్‌తో 'రేఖాచిత్రం' తెరకెక్కింది. థియేటర్లతో పాటు ఓటీటీలోనూ ఈ చిత్రం మంచి ఆదరణ దక్కించుకుంది.

# నూరేళ్లు సంతోషంగా ఉండాలి..



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు గత కొంతకాలంగా సినిమాలతో కంటే వ్యక్తిగత విషయాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. ముఖ్యంగా డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో సామ్ డేటింగ్ లో ఉందంటూ కొన్ని రోజులుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇద్దరూ తరచుగా కలిసి కనిపిస్తుండటం, గుళ్ళూ గోపురాలు తిరుగుతుండటం, రాజ్ తో క్లోజ్ గా ఉన్న ఫోటోలను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుండటంతో ఈ రూమర్స్ మరీ ఎక్కువయ్యాయి. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈ వార్తలే కనిపిస్తున్నాయి. అవన్నీ రూమర్స్ అని సమంత మేనేజర్ చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు రాజ్-సామ్ లను ఉద్దేశించి ఓ నటి చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ లో సమంత నిర్మాణంలో రూపొందిన ఫస్ట్ మూవీ 'శుభం'. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి ప్రధాన పాత్రలు పోషించారు. సామ్ స్పెషల్ రోల్ లో అలరించింది. ఇటీవలే రిలీజైన ఈ సినిమాకి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా చిత్ర బృందం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా సీనియర్ నటి మధుమణి మాట్లాడుతూ.. సమంత - రాజ్ నిడిమోరు గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

"నేను 39 ఏళ్ల జర్నీలో చాలా సినిమాలు చేశాను. 3 నంది అవార్డులు, 2 ఫిలింఫేర్ అవార్డులు తీసుకున్నా. నాని దగ్గర నుంచి అనుష్క వరకూ.. అందరు హీరో హీరోయిన్లకు మదర్ గా నటించా. దాదాపు 400 చిత్రాల్లో యాక్ట్ చేశాను కానీ.. సమంతకు అమ్మగా ఒక్క సినిమా కూడా చేయలేకపోయాను. 'రంగస్థలం' సినిమాలో ఆమెతో కలిసి ఛాన్స్ మిస్ అయింది. ఆ బాధ ఎప్పుడూ ఉండేది. ఆమెను ఎప్పుడైనా కలుస్తానా? మాట్లాడతానా? కలిసి పనిచేస్తానా? అని ఒక ఆశ ఉండేది. సమంత ప్రొడక్షన్ లో రూపొందే సినిమాలో మదర్ క్యారక్టర్ కోసం టీం నన్ను సంప్రదించారు. అలా మొదలైంది ఈ శుభం"

"ఒక్క రోజు షూటింగ్ చేయగానే చికెన్ గన్యా వచ్చింది. నాలుగు నెలలు అడుగుతీసి బయటపెట్టలేని పరిస్థితి. అప్పటికే ఏడు సినిమాల్లో నటిస్తున్నా కానీ.. ఈ సినిమా మిస్ అవుతుందేమోనని భయపడ్డా. నా అదృష్టం కొద్దీ నాలుగు నెలల తర్వాత మళ్లీ 'శుభం'తో ప్రయాణం మొదలైంది. ఇప్పుడు ఆరు సినిమాల్లో అద్భుతమైన పాత్రలు చేస్తున్నా. ఇది తక్కువ బడ్జెట్ లో చేసిన చిన్న సినిమా అని అంటున్నారు. కానీ వాళ్ళు ఇచ్చిన ఆతిథ్యం చాలా గొప్పగా ఉంది. సమంత ప్రతీ ఒక్కరినీ ఎంతో బాగా చూసుకున్నారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన సామ్ కు శుభం. రాజ్, సమంత శుభంతో ఈ జర్నీ మొదలు పెట్టారు. శుభంగానే ఇలాగే ఎల్లవేళలా సంతోషంగా ఉండాలి" అని మధుమణి చెప్పుకొచ్చింది. అంతేకాదు శతమానం భవతి అంటూ దీవించింది.రాజ్ డీకే తెరకెక్కించిన 'ది ఫ్యామిలీ మ్యాన్' సీజన్-2లో సమంత నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించింది. ఆ తర్వాత 'సిటాడెల్: హనీ బన్నీ' సిరీస్ లో చేసింది. ప్రమోషన్స్ సమయంలో టీంతో కలిసి ఇద్దరూ తిరుమల వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లేటెస్టుగా రాజ్ తో దిగిన ఓ ఫోటోని సమంత ఇంస్టా గ్రామ్‌లో షేర్ చేయడం హాట్ టాపిక్ గా నడుస్తోంది.

# నేను ప్రభాస్ ఫ్యాన్‌ని..శోభన్‌బాబు మా తాత అని తెలియదు




తెలుగు సినీ చరిత్రలో శోభన్ బాబు తనకంటూ ఓ అధ్యాయాన్ని లిఖించుకున్నారు. టాలీవుడ్ లో నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణలకు గట్టిగా పోటీగా నిలిచారు. కొన్ని దశాబ్దాలపాటు ప్రేక్షకులను అలరించిన ఆయన.. సోగ్గాడిగా అభిమానుల హృదయాల్లో నిలిచిపోయారు. అయితే శోభన్ బాబు తన వారసులను ఎవరినీ ఇండస్ట్రీకి పరిచయం చేయలేదు. దీనిపై సురక్షిత్ మాట్లాడుతూ.. "శోభన్ బాబు తన ఫ్యామిలీ నుంచి ఎవరూ సినిమాల్లోకి వెళ్లకూడదని స్ట్రిక్ట్ గా ఉన్నారని అందరూ అనుకుంటుంటారు. నిజానికి మాకు అలాంటి రూల్స్ ఏమీ లేవు" అని అన్నారు.

"అందరూ ఆయన్ను సోగ్గాడిగానే చూస్తారు కానీ, ఆ స్థాయికి చేరుకోడానికి ఎంతగా స్ట్రగుల్ అయ్యాడు, ఎంత హార్డ్ వర్క్ చేశాడనేది ఎవరికీ తెలియదు. అది అందరికీ సాధ్యమయ్యేది కాదు. అందుకే సినీ ఇండస్ట్రీకి దూరంగా ఉండాలని మేమంతా నిర్ణయించుకున్నాం" అని సురక్షిత్ తెలిపారు. "10వ తరగతి చదువుతున్నప్పటి నుంచే నాకు సినిమా ఆఫర్స్ వచ్చాయి. చాలామంది దర్శక నిర్మాతలు వచ్చి నటించమని అడిగారు కానీ, నాకు యాక్ట్ చేయాలని ఎప్పుడూ అనిపించలేదు" అని చెప్పారు.

శోభన్ బాబు చనిపోయే సమయానికి తాను ఇంటర్మీడియట్ చదువుతున్నట్లు సురక్షిత్ తెలిపారు. తనకు సురక్షిత్ అని నామకరణం చేసింది తన గ్రాండ్ ఫాదర్ శోభన్ బాబు అని చెప్పారు. ఫ్యామిలీలో అందరి పేర్లు ఉండాలని శోభన్ బాబు భావించారని, దాన్ని ముందుకు తీసుకెళ్తూ తన పిల్లలకు కూడా అదే అక్షరం వచ్చేలా పేర్లు పెట్టినట్లు వెల్లడించారు. కుటుంబంలో అందరి పేర్లూ ఎస్ లెటర్ తో ఉంటాయని, దాన్ని సెంటిమెంట్ గా మార్చుకున్నామన్నారు. తాను డాక్టర్ కావాలనేది శోభన్ బాబు విజన్ అని, ప్రస్తుతం ఆయన విజన్ లోనే నడుస్తున్నానన్నారు సురక్షిత్.

"చిన్నప్పటి నుంచే డాక్టర్ అవ్వాలని నన్ను ట్యూన్ చేశారు. మెడిసిన్ చదవాలని, పెద్ద డాక్టర్ అవ్వాలని మా తాత చెబుతూ ఉండేవారు. మా నాన్న కూడా అదే వృత్తిలో ఉండటంతో నాకు ఈజీ అయిపోయింది" అని సురక్షిత్ చెప్పారు. సినిమాలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ ఫ్యామిలీకి టైం కేటాయించేవారని, శోభన్ బాబుగా కాకుండా తనను తాతగానే చూడాలని అనుకునేవారని, అందుకే అంత పెద్ద స్టార్ హీరో అనే విషయం అప్పట్లో తనకు తెలియలేదని సురక్షిత్ అన్నారు. ఒకసారి శోభన్ బాబు పుట్టినరోజు కోసం స్వగ్రామానికి వెళ్తే.. తనని చూడటానికి ఊరంతా వచ్చారని, అప్పుడే తన తాత ఎంత ఫేమస్ అనేది తెలిసిందని చెప్పారు.

"ఇంట్లో అసలు సినిమాలు చూసేవాళ్ళం కాదు. తాత కూడా ఎంకరేజ్ చేసేవాడు కాదు. నేను ఆయన నటించిన సినిమాలు రెండే చూశాను. శోభన్ బాబు నటించిన సినిమాల్లో 'ఏమండీ ఆవిడ వచ్చింది' ఒక్కటే థియేటర్లో చూశాను" అని సురక్షిత్ అన్నారు. ఇప్పుడు తమిళనాడులో ఉండటం వల్ల తెలుగు సినిమాలు చూడటం చాలా తక్కువని, ప్రభాస్ కి తాను పెద్ద ఫ్యాన్ అని, 'బాహుబలి' తన ఫేవరేట్ మూవీ అని చెప్పారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,